J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 40 సంచిక : 33 15.1.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## కులం కోరల్లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్!...

# అడ్డగోలుగా నిమ్మగడ్డ

- కోర్టులు ఎన్నికలు వద్దన్నా.. తాను ముద్దంటున్నాడు
- ఎన్నికల కమిషన్ ఎంత బలమైందో టిఎన్ శేషన్ నిరూపిస్తే.. ఆయన ఆత్మ ఘోషించేలా రమేష్‌కుమార్ భ్రష్టు పట్టిస్తున్నాడు

ఎన్నికల కమిషన్లు స్వతంత్రంగా పనిచేస్తాయి. 1990కి ముందు రాజకీయ పార్టీల ముసుగులో, నేతల కనుసన్నల్లో నడిచినా టీఎన్ శేషన్ 1990లో భారతదేశ ముఖ్య ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించాక కమిషన్ స్వరూపాన్నే మార్చేశారు. అప్పటివరకు కొనసాగిన అక్రమాలను నిలువరించడంతో పాటు ధనం, మద్యం విచ్చలవిడితనానికి బ్రేక్ వేయడంలో శేషన్ సఫలీకృతం అవడం, సీఈసీ అనే పదవిని పునర్నిర్వచించడంతో శేషన్ రాజకీయ పార్టీల, నేతల గుండెల్లో సింహ స్వప్నమయ్యారు. ఒకరకంగా ఆయన ఎన్నికల సంస్కరణల పితామహునిగా అలరారారు.

దీనికి పూర్తి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడు ఆంధ్ర రాష్ట్ర ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్. ఆంధ్రాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలలో ధనం, మద్యాన్ని నిలువరించడానికి, సామాన్యుడు కూడా ఎన్నికలలో పోటీ చేసే (మిగతా 9వ పేజీలో)

## కరోనాపై యుద్ధం...

# కోవిడ్ టీకా సిద్ధం

(వివరాలు 6వ పేజీలో)





# నెల్లూరులో 'జగన్'


## 'అమ్మ ఒడి' రెండో విడత సాయం పంపిణీ

- కొందరు కడుపుమంటతో మంట పెడుతున్నారు
- గుళ్ళతో పాటు బళ్ళపై కూడా దాడులు జరుగుతాయేమో జాగ్రత్త!

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ఏకైక ధ్యేయంగా దేశంలోనే కనీవినీ ఎరుగని విధంగా ఎన్నో సాహసోపేత, సంచలనాత్మక సంక్షేమ పథకాలను నిర్భయంగా అమలుచేస్తున్న మహానేత డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయుడు, యువనేత..జననేత..రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన మానసపుత్రిక అయిన 'అమ్మ ఒడి' పథకం రెండోవిడత సాయం అందించడానికి నగరానికి రావడంతో నెల్లూరు నేల పులకించిపోయింది.

10లో





## బహుముఖ ప్రజ్ఞాశాలి.. పాత్రికేయ ధీశాలి..

# తుర్లపాటి... ఇక లేరు




తెలుగు పాత్రికేయరంగంలో అనర్ఘరత్నంగా ప్రకాశించిన తుర్లపాటి కుటుంబరావును తెలియని వారు బహు అరుదు. చిన్నతనం నుంచే సాహిత్యం, రచనా వ్యాసంగం పట్ల అభిరుచి పెంచుకుని, ఆ తర్వాత కాలంలో పాత్రికేయరంగంలో ప్రముఖమైన సంపాదకుని స్థానంలోనూ, రచనా రంగంలోనూ అద్వితీయ ప్రజ్ఞాపాటవాలతో రాణించి ఎన్నో అవార్డులు.. ప్రముఖుల ప్రశంసలందుకున్న ఉత్తమ పాత్రికేయులాయన. ఎన్నో పత్రికల్లో.. ప్రముఖ దినపత్రికల్లో ఆయన కొల్లలుగా రాసిన వ్యాసాలు, ప్రముఖుల జీవిత రేఖాచిత్రాలు భావితరాలకు మార్గదర్శకాలు.

**సుప్రసిద్ధ పాత్రికేయులు, నడిచే విజ్ఞాన సర్వస్వంగా..బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరెన్నికగన్న సీనియర్ సంపాదకులు పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు (88) మృతి పాత్రికేయ రంగానికే కాక, అశేష పాఠక లోకానికి, ప్రజానీకానికి తీరని ఆవేదన కలిగించింది. ఈనెల 10వ తేది ఆదివారం రాత్రి అస్వస్థతకు గురై విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి దాటాక గుండెపోటు వచ్చి తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో తెలుగు పత్రికారంగం ఒక ఆణిముత్యాన్ని కోల్పోయినట్లయింది.**

మంచి రచయితగా, వక్తగా, వ్యాఖ్యాతగా ఆయనెంతగానో ప్రసిద్ధి చెందారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం వద్ద కార్యదర్శిగా పనిచేసిన ప్రజ్ఞావంతులాయన. టంగుటూరి ముఖ్యమంత్రి అయినప్పుడు తుర్లపాటిని తనవద్దనే ఉండాలని కోరినా సున్నితంగా తిరస్కరించిన మృదుస్వభావి. ప్రభుత్వంలో ఉంటూ నిజాలను దాచి రాయలేనని, జర్నలిస్టుగానే ఉంటానని స్పష్టంచేసిన నిబద్ధత కలిగిన పాత్రికేయుడుగా తుర్లపాటి కుటుంబరావు పాత్రికేయరంగంలో ఎందరికో ఆదర్శనీయుడు. అంతేకాదు, ఆంధ్రరాష్ట్రాన్ని పాలించిన తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం మొదలకుని నారా చంద్రబాబునాయుడు దాకా 18 మంది ముఖ్యమంత్రుల వద్ద పనిచేసిన అసామాన్య పాత్రికేయునిగా విఖ్యాతిచెందారు. ఆయన రాసిన '18 మంది ముఖ్యమంత్రులతో నా ముచ్చట్లు' అనే పుస్తకంలో అనేక ఆసక్తికరమైన విషయాలను కూడా పొందుపరిచారు. పాత్రికేయ రంగంలో అపార అనుభవం గడించిన పాత్రికేయ యోధునిగా, 2002లో కేంద్రప్రభుత్వం నుంచి ఎంతో ప్రతిష్టాత్మకమైన 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్న తొలి తెలుగు జర్నలిస్టుగా ఆయన ఆంధ్రరాష్ట్రంలోనే కాక దేశవ్యాప్త ఖ్యాతిని గడించారు. ప్రత్యేకించి ఆయనకు తెలుగంటే మహా ఇష్టం. తెలుగును కానీ, తెలుగువారిని కానీ ఎవరన్నా చులకనగా మాట్లాడారంటే సహించేవారు కాదు.. కలమెత్తి గళమెత్తి గదమాయించేవారు.

### 14 ఏళ్ల వయసులోనే పాత్రికేయ రంగంలోకి

1933లో విజయవాడలో జన్మించిన తుర్లపాటి కేవలం పద్నాలుగేళ్ల వయసులోనే పాత్రికేయ రంగంలోకి అడుగుపెట్టారు. పాత్రికేయరంగమన్నా, రచనా రంగమన్నా ఆయనకెంతో ఇష్టం. 1947 ప్రాంతాల్లో ప్రాంతాల్లోనే ఆయన తొలిరచన మాతృభూమి పత్రికలో ప్రచురితమైంది. ఇదే ఆయన తొలి వ్యాసం కూడా. 1951లో ఆచార్య ఎన్.జి రంగాగారి 'వాహిని' పత్రికలో ఆయన ఉప సంపాదకునిగా చేరారు. ఆ తర్వాత 'ప్రతిభ' పత్రికలో ఎడిటర్‌గా నిరుపమానమైన సేవలందించారు. టంగుటూరు ప్రకాశం పంతులు అప్పట్లో ఆయన్ను చెన్నైకి పిలిపించుకుని తాను నడుపుతున్న ప్రజాపత్రికలో సహాయ సంపాదకుడి బాధ్యతలను అప్పగించారు. ఆ తర్వాత కాలంలో ఆయనొక సినిమాపత్రికకు సంపాదకునిగా పనిచేశారు. కొద్దికాలం తర్వాత ఒక దినపత్రిక ఎడిటర్‌గా 1991 దాకా బాధ్యతలు నిర్వర్తించారు. తదుపరి స్వేచ్ఛా పాత్రికేయునిగా తన వ్యాసంగం కొనసాగించారు. పాత్రికేయవృత్తిలో భాగంగా ప్రముఖ జాతీయ నాయకులైన డా. బాబాసాహెబ్ అంబేద్కర్, నెహ్రూజీ, రాజాజీ వంటి మహానాయకులను ఇంటర్వ్యూ చేసిన ఘనత ఆయనది. వేలాదిమంది ప్రముఖ వ్యక్తుల జీవితాలను పాఠకలోకానికి చాటిచెప్పిన ఆయన రచనాశైలి అత్యద్భుతం. దాదాపు ఆరువేల మంది జీవితచరిత్రలను రచించి అద్వితీయమైన రచయితగా విఖ్యాతిగాంచారు. దాదాపు ఇరవై వేలకు పైగానే సభలు సమావేశాలకు అధ్యక్షత వహించిన ఘనాపాటి..మన తుర్లపాటి.





## 2008లో...'తుంగా అవార్డు'

### 'లాయర్' వారపత్రిక సారధ్యంలో ఘనమైన సన్మానం

జర్నలిజం రంగంలో భీష్ముని వంటివారైన తుర్లపాటి కుటుంబరావుకు 2008 జూన్ 22వ తేదిన 'లాయర్' వారపత్రిక సారధ్యంలో 'తుంగా అవార్డు'నిచ్చి ఘనంగా సత్కరించడం జరిగింది. నెల్లూరులోని వి.ఆర్.సి గ్రౌండ్స్‌లో వేలాదిమంది 'లాయర్' పత్రికాభిమానుల మధ్య, నాటి బిజెపి జాతీయ నాయకులు, నేటి భారత ఉపరాష్ట్రపతి, మన నెల్లూరీయుడైన ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా.. మాజీ ఎమ్మెల్యే జెకెరెడ్డి, 'లాయర్' ప్రభు కలసి ఎంతో ప్రతిష్టాత్మకమైన 'తుంగా రాజగోపాలరెడ్డి అవార్డు'ను తుర్లపాటికి ఆత్మీయంగా బహుకరించడం 'లాయర్' జ్ఞాపకాల్లో నేటికీ పదిలంగా నిలిచే ఉంది.

నాటి అవార్డు సభలో తుర్లపాటి మాట్లాడుతూ..'నేనెన్నో పెద్దసభలకు అధ్యక్షత వహించాను కానీ ఇంతపెద్ద సభలో సన్మానం పొందడం ఇదే ప్రథమం. రాష్ట్రంలో ముగ్గురు నాయుడులు రాజకీయాల్లో ప్రముఖస్థానాల్లో ఉన్నారు. వారిలో చంద్రబాబునాయుడు, ఎర్రన్నాయుడుల చేతులమీదుగా గతంలోనే సన్మానం జరిగింది. ఇంతకాలం వెంకయ్యనాయుడు చేతులమీదుగా సన్మానం జరగలేదనే లోటుండేది. 'లాయర్' 27వ వార్షికోత్సవంలో ఇప్పుడా లోటు కూడా తీరింద'ంటూ తుర్లపాటి ఆనాడు పేర్కొన్నారు. అంతేకాదు, 'నాకు నెల్లూరు రెండో పుట్టినిల్లు లాంటిది. రాజకీయ, సినీ, పత్రికా రంగాలకు నెల్లూరు ప్రసిద్ధి. ఈ మూడు రంగాల్లోనూ కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డికి ప్రవేశముంది. ఆ మూడు రంగాలతో నాకు పరిచయం ఉంది. జర్నలిజంలో 50 ఏళ్లు పూర్తిచేసుకున్నప్పుడు అప్పట్లో రాజ్‌భవన్‌లో గవర్నర్ చేతులమీదుగా నన్ను సన్మానించారు. ఈరోజు అంతకంటే గొప్పగా తుంగా రాజగోపాల రెడ్డి అవార్డు నాకు అందజేయడం నా అదృష్టంగా భావిస్తున్నా'నంటూ ఆయన ఉప్పొంగిపోయారు.

ఆ తర్వాత నుంచి ఇటీవల దాకా కూడా తుర్లపాటి 'లాయర్' కుటుంబానికి ఎంతో ఆత్మీయునిగా ఉండేవారు. ప్రత్యేకించి 'లాయర్' అధినేత తుంగా శివప్రభాత్ రెడ్డితో మంచి సాన్నిహిత్యం కూడా ఉండేది. అలాంటి కలం యోధుని మరణవార్త మాకెంతో దిగ్భ్రాంతిని..ఆవేదనను కలిగిస్తోంది.

రాష్ట్ర స్థాయిలోనే కాక, జాతీయ స్థాయిలో సైతం రాణిస్తూ..పాత్రికేయ రంగానికే గొప్ప గౌరవం తెచ్చిన ప్రజ్ఞావంతుడు తుర్లపాటి కుటుంబరావు మరణం ఎంతో బాధాకరం. వారి మృతికి విచారం ప్రకటిస్తూ...వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది..'లాయర్'!...ఆ మహనీయునికిదే మా కన్నీటి నివాళి.

### విశిష్ట వ్యక్తిత్వం ఆయన సొంతం..

విశేషమైన ప్రజ్ఞాపాటవాలతో రాణిస్తూ అనేకానేక అవార్డులను, ఘనమైన పురస్కారాలను అందుకున్నారు. ఎందరో ప్రముఖుల, జాతీయస్థాయి నాయకుల అభిమానాన్ని చూరగొన్నారు. ఉత్తమ జీవితచరిత్రల రచయితగా కూడా తెలుగు విశ్వవిద్యాలయం నుంచి అవార్డును కూడా పొందారు. 1993లో గిన్నిస్‌బుక్ రికార్డును, 1998లో అమెరికా నుంచి ప్రపంచస్థాయి జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. 2010లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ అధ్యక్షునిగా కూడా బాధ్యతలను నిర్వర్తించారు. దాదాపు ఏడు దశాబ్దాల పాటు పాత్రికేయరంగానికి, రచనా రంగానికి విశేషమైన సేవలందించిన పాత్రికేయ భీష్ముడు.. తుర్లపాటి గారు. పాత్రికేయవృత్తిలో నీతి నిజాయితీలతో, నైతిక విలువలతో, విశిష్టమైన వ్యక్తిత్వంతో, ఎంతో నిబద్ధతతో ఆయన పనిచేసిన తీరు అపూర్వం..పాత్రికేయరంగానికే ఆదర్శం. ఆయన లేని లోటు ఏనాటికీ తీరనిది.. ఎవరూ తీర్చలేనిది!

## 'సింహపురి' ముద్దుబిడ్డగా

పదకొండేళ్లకే హృద్యమైన పద్యరచన చేసి
మూడు శతకాల అక్షర పతాకాలెగరేశారు
పాటలు మాటల పూలబాటలలోనే కాక
నాటకాల పాత్రదారులలోనూ నడిచారు...
తమిళపాటల తలపులు తెలుగులో చూపుతూ
ఆ రాష్ట్ర ప్రజల ఆత్మీయవ్యక్తిగా గెలిచారు
హిందీ గీతాల్ని మాతృభాషలో అందంగా చెక్కుతూ
జాతీయ స్థాయిలో వెన్నెలజ్యోతిగా నిలిచారు...
సాహిత్యంలో గురువు గారి స్ఫూర్తిని పంచాలని
"నాగభైరవ అవార్డు కమిటీ" అధ్యక్షులయ్యారు
సినీ రంగంలో మిమ్ము నిలిపిన "బాలు" గారిని
అన్నయ్యగానే కాక దైవంగా సదా భావించారు...
పరభాషా చిత్రాలకు సరైన అనువాదంతో
పేరు ప్రఖ్యాతుల చిరునామాకు చేరుకున్నారు
అనేక సంస్థలకు సహాయ సహకారాలిస్తూ
మూడు రాష్ట్రాల ప్రజాభిమానాన్ని చూరగొన్నారు...
మీ శక్తులను ఇద్దరు తనయులకు పంచారు
"వెన్నెలకంటి" వారసత్వాన్ని తెరపై నిలిపారు
తెలుగు భాషామతల్లికి మీ సేవలు అమూల్యం
మీరు పంచిన స్నేహపరిమళాలు అసామాన్యం...
'చెన్నపురి' చేరినా 'సింహపురి' ముద్దుబిడ్డగా
ఎన్నో ప్రశంసల శిఖరాలు అధిరోహించారు
మీ పాట ద్వారా మీరు 'నంది అవార్డు' విజేతగా
శాశ్వత కీర్తిప్రతిష్టల తృప్తిని ఆస్వాదించారు...
అందుకే మన జిల్లా వారికి మనవి చేస్తున్నా!
"వెన్నెలకంటి అవార్డు"ను ఏర్పాటు చేయాలని
అక్షరాలకు రివార్డును ఏటేటా ఇవ్వాలని...

– బొగ్గరపు రాధాకృష్ణమూర్తి
నెల్లూరు. 9885481939

## పండుగల్లో కొండెక్కిన ధరలు




ఏడాదికోసారి సంతోష సరంభాలు తెచ్చే పెద్ద పండుగలు రానురాను వెల వెలబోతున్నాయి. గతంలో ఉన్న పండుగల ఆనందం ఇప్పుడు అంతగా ఉండడం లేదు. నిరుపేదలు, మధ్య తరగతి కుటుంబాల్లో పెద్దగా పండుగ సందడే కనిపించడం లేదు. వంట కాలకు, పిండి వంటలకు అవసరమయ్యే నూనెల ధరలు సల సల కాగిపోతున్నాయి. పప్పులు, ఉప్పులు అన్నీ ఆకాశానికేసి చూస్తున్నాయి. ఆకు కూరలు, కాయగూరల ధరలు కూడా మమ్మల్ని కొంటే.. మిమ్మల్ని తింటాం అన్నట్లుగా గుర్రుగా చూస్తున్నాయి. ఈ పండుగ రోజుల్లో ఏం వండుకు తినాలన్నా ధరల దాడితో బెదిరిపోయి అనేకమంది మొక్కుబడి తంతుగా పండుగలు జరుపుకుంటున్నారు.

### భోగి తాటాకుల ధర భగ్గు.. భగ్గు

భోగి పండుగ కదా!..సంప్రదాయం ప్రకారం భోగిమంటలు వేసుకుని ఆనందిద్దామంటే.. భోగి తాటాకు ధర చుక్కలు చూపించింది. గత ఏడాది తాటాకుల కట్ట(నాలుగాకులు) 20 రూపాయలు పలికితే, ఇప్పుడు ఏకంగా 50 రూపాయలకి తక్కువగా ఇచ్చేది లేదని తెగేసి చెప్పడంతో ప్రజలు అయోమయంలో పడ్డారు. నాలుగు తాటాకులు 50 రూపాయలా?.. ఇదెక్కడి కలి కాలం నాయనా!.. పోనీ వందిస్తాం.. మూడు కట్టలన్నా ఇవ్వండయ్యా'.. అంటే, ఇది కలికాలం కాదయ్యో..కరోనా కాలం అంటూ వ్యాపారులు తెగేసి చెప్పారు.

## కళ్యాణ వైభవం...!




నెల్లూరు వాస్తవ్యులు కామిరెడ్డి సతీష్‌రెడ్డి - అరజల కుమార్తె **రోనిత - పుష్కర్‌రెడ్డి** (నెల్లూరు వాస్తవ్యులు గూడూరు భక్తవత్సలరెడ్డి - జ్యోతిల కుమారుడు)ల వివాహం ఈ నెల 6వ తేదీ నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్ నందు వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# 'అమ్మ ఒడి' అద్భుతంగా జరిగింది

## సిఎం సభ పండుగను తలపించింది - మంత్రి అనిల్



నెల్లూరులో 'అమ్మ ఒడి' పథకం కార్యక్రమం అద్భుతంగా జరిగిందని, సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సభ పండుగను తలపించిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 12న నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న సిఎం సభను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగనన్న పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా నెల్లూరు నగర నియోజకవర్గానికి రావడం, 'అమ్మ ఒడి' పథకం రెండో విడత సాయం అందజేసే కార్యక్రమం నెల్లూరు నుంచే ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని, అందరి సహాయ సహకారాలతో సిఎం సభ దిగ్విజయంగా జరగడం సంతోషకరమని అన్నారు. అటు జిల్లాలోను, ఇటు నెల్లూరు నగరంలోను ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సంకల్పించామని, రానున్న రెండునెలల్లో పెన్నానదికి నగరంలో ఇరువైపులా బండ్స్ ఏర్పాటుచేస్తామన్నారు. సోమశిల, కండలేరు, పెన్నాబ్యారేజ్‌లకు సంబంధించిన పనులన్నీ త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. పంచాయతీ ఎన్నికల విషయంలో కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఏకపక్షంగా వ్యవహరించడం దారుణమని, ఎన్నికలకు సంబంధించి కోర్టు ఇచ్చిన తీర్పు ఎస్ఇసికి చెంపపెట్టులాంటిదని భావిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. ఒక రాజకీయపార్టీకి కొమ్ముకాస్తున్న రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగే అవకాశం లేదన్నారు. చంద్రబాబుది, టిడిపి నాయకులది మొదటినుంచి వంకరబుద్ధేనని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా రెండురోజుల ముందో ఆ తర్వాతో అలజడి రేపడానికి ప్రయత్నిస్తుంటారని, ఈ నేపథ్యంలో గుడులు, బడుల విషయంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు.

# భక్తజన సంద్రంగా.. అల్లూరు

- పోలేరమ్మ జాతరకు.. పోటెత్తిన భక్తులు
- తరలివచ్చిన ప్రముఖులు






***అల్లూరు పోలేరమ్మ జాతరకు భక్తజనం పోటెత్తారు. దీంతో అల్లూరు వీధులన్నీ భక్తుల రాకపోకలతో క్రిక్కిరిసిపోయాయి. ఆపదల నుంచి కాపాడే గ్రామశక్తిగా.. భక్తుల కొంగుబంగారంగా వెలసిన అల్లూరు గ్రామదేవత పోలేరమ్మతల్లి జాతర ఈనెల 12వ తేది మంగళవారం అశేష భక్తజన సందోహం మధ్య అత్యంత వైభవంగా జరిగింది.***

అందరినీ కాపాడే చల్లని తల్లిగా, అన్నిరకాల వ్యాధులు బాధలను నివారించే అమ్మగా పోలేరమ్మ తల్లి ప్రసిద్ధి. ఎంతో మహిమాన్వితమైన గ్రామశక్తిగా అమ్మవారు ప్రతీతి. తరతరాలుగా పోలేరమ్మ అమ్మవారికి అల్లూరులో పెద్దఎత్తున పూజలు, సేవలు, ప్రతిఏటా జాతర అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సంప్రదాయం ప్రకారం ప్రతి ఏటా సంక్రాంతికి ముందు వచ్చే మంగళవారం నాడు అమ్మవారికి జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ జాతర సందర్భంగా ఆలయాన్ని పుష్పాలంకరణలతో, విద్యుద్దీపాలంకరణలతో కన్నులపండువ చేశారు. శక్తి స్వరూపిణి, కరుణామయి అయిన పోలేరమ్మ అమ్మవారిని ఆలయ అర్చకులు శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. బంగారుచీర, బంగారు ఆభరణాలతో స్వర్ణకాంతుల ధగధగలతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. 'అమ్మా తల్లీ పోలేరమ్మా.. అందరనీ చల్లంగ కాపాడమ్మా'..అంటూ భక్తజనం పెద్దఎత్తున అమ్మవారి నామస్మరణలు చేస్తూ ఎంతో భక్తిశ్రద్ధలతో దండాలు పెట్టుకున్నారు. గ్రామప్రజలు, పెద్దసంఖ్యలో భక్తులు జాతరకు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన చల్దిని కొత్త కుండల్లో తీసుకుని వచ్చి ఆలయం ప్రాంగణం వద్ద ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు.

కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో పాటు గ్రామపెద్దలు, ప్రజలు, దాతల సహకారంతో అమ్మవారి జాతరకు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకించి అల్లూరోళ్లు దేశంలో ఎక్కడున్నా అల్లూరుకు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటూ ఉంటారు. ఈ జాతరలో రాష్ట్ర నీటిపారుదల మంత్రి డాక్టర్ అనిల్ కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టిటిడి పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, ఆప్కాఫ్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, డిసిసిబి మాజీ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, వైఎస్సార్సీపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రూప్ కుమార్‌యాదవ్‌తో పాటు ఎందరో ప్రముఖులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన ప్రముఖులందరినీ జాతర పర్యవేక్షకుడు సుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అల్లూరు గ్రామం నుంచే కాక, జిల్లా వ్యాప్తంగా, రాష్ట్ర నలుమూలల నుంచి కూడా భక్తులు పోలేరమ్మ జాతరకు తరలిరావడంతో అల్లూరు భక్తజన కోలాహలంతో కళకళలాడింది. జాతర సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి.

## 'ప్రభా'తం

# ప్రబలుతున్న నిరుద్యోగం

**ఎంతోకాలంగా దేశంలో నిరుద్యోగం ప్రబలిపోతూనే ఉంది. అందులోనూ ఈ కరోనా కష్టకాలంలో ఉద్యోగాలు, ఉపాధిమార్గాలు కరువై చదువుకున్న యువతీ యువకులెంతోమంది సరైన జీవనోపాధి లభించక అయోమయంలో పడిపోతున్నారు. ఇకనైనా నిరుద్యోగాన్ని నియంత్రిం చేందుకు ప్రభుత్వాలు సత్వర చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రతిభాపాటవాలతో యువత రాణించేలా శిక్షణనిచ్చి, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించి దేశంలోని యువత భవితకు బంగారుబాటలు వేయాల్సి ఉంది.**

దేశంలో నానాటికీ నిరుద్యోగం పెరిగిపోతోంది. చదువుకున్న యువత ఉపాధి అవకాశాలు కరువై అల్లాడుతున్నారు. చదివిన చదువులకు తగిన ఉద్యోగాలు దొరక్క, ఏ పని చేయాలో అర్థం కాక, జీవనోపాధి కోసం నానా యాతనలు పడుతున్నారు. ఎంతో కష్టపడి తల్లిదండ్రులు తమను మంచి చదువులు చదివించినా, తాము బాగానే చదువుకున్నా చివరికి సరైన ఉద్యోగాలు దొరక్క కోట్లాదిమంది యువతీ యువకులు అయోమయంలో పడిపోతున్నారు. అన్ని రంగాల్లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించి ఆదుకోవాల్సిన పరిస్థితుల్లో దేశం కరోనా మహమ్మారి వ్యాధితో అతలాకుతలం కావడంతో యువత నిరాశా నిస్పృహలతో కొట్టుమిట్టాడుతూ ఉండడం ఎంతైనా బాధాకరం. కష్టపడి చదువుకుంటే ఇష్టమైన ఉద్యోగాలు లభించి జీవితాలు సాఫీగా సాగిపోతాయన్న ఆశతో జీవించే యువత ఈ గడ్డు పరిస్థితులను జీర్ణించుకోలేకపోతున్నారు. కరోనా మాయదారి వ్యాధితో ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాల ఆర్థిక పరిస్థితులు తలకిందులైపోయాయి. మన దేశంలో కూడా అనేక రంగాలు సంక్షోభంలోపడి కుదేలైపోయాయి. కేంద్రం, రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు నిరంతరం ఈ సంక్షోభాల నుంచి ప్రజలను గట్టెక్కించేందుకు శక్తివంచన లేకుండా శ్రమిస్తూనే ఉన్నా ఇంకా ఆశించిన స్థాయిలో కోలుకోలేని పరిస్థితి. అసలే సరైన ఉద్యోగాలు లేక అవస్థలు పడుతుంటే ఈ కరోనా దెబ్బతో ఉన్న ఉద్యోగాలు కూడా కోల్పోయి కోట్లాదిమంది యువత పడే బాధలు వర్ణనాతీతం. మరోవైపు నిరుద్యోగంతో పాటు పేదరికం పెరిగిపోతూ ఉండడంతో ప్రజల జీవన స్థితిగతులు, ముఖ్యంగా నిరుపేద, మధ్య తరగతి యువత జీవితాలు అస్తుబిస్తుగా మారి పోతున్నాయి.

దేశంలో ఇప్పుడే కాదు.. దశాబ్దాల తరబడి నిరుద్యోగం పెరిగిపోతూనే ఉందని, గతంలో పాలకులు అనుసరించిన అస్తవ్యస్తమైన విధానాలే ఇందుకు కారణమనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రతిభా పాటవాలున్న యువతకు వారి మేధోతనం, నైపుణ్యాలకు తగినట్లుగా తగు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించలేకపోవడం ఎంతైనా దురదృష్టకరమని, ఎంతోకాలంగా మనదేశంలో ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటుండడంతో ఎంతోమంది ప్రతిభావంతులు దూరదేశాలకు పయనమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని నిపుణుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దేశ జనాభాలో మూడోవంతు దాకా ఉన్న యువతకు అన్ని విధాలా చేయందించి వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయాల్సి ఉన్నా, వారి శక్తిసామర్థ్యాలకు తగిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంపై గత ప్రభుత్వాలు తగిన శ్రద్ధ తీసుకోకపోవడంతో నాటి నుంచి నేటికీ నిరుద్యోగం అంతకంతకు పెరిగిపోతూనే ఉంది. అలాంటి దుస్థితిని తొలగించడానికి నేటి ప్రభుత్వాలు బాగా చొరవ తీసుకుంటున్న తరుణంలో కరోనా ముంచుకురావడం ఎంతైనా బాధాకరం.

ఆ మహమ్మారి ప్రభావంతో అనేకమంది యువత ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు. డిగ్రీలు, పీజీలు పూర్తిచేసిన వారు కూడా అత్యధికశాతం మంది నేటికీ ఉద్యోగాల వేటలోనే ఉన్నారంటే అతిశయోక్తేమీ కాదు. మహిళలకు కూడా ఉద్యోగాలు కరువైపోతున్న ఈ కరోనా కష్టకాలంలో దేశంలో కోట్లాదిమంది యువతీ యువకులు జీవనోపాధి కోసం నానా కష్టాలు పడుతున్నారు. సరైన ఉపాధి దొరక్క.. దొరికిన జీవనోపాధి మార్గాన్నే ఎంచుకుంటూ జీవితాలను గడిపేస్తున్నవారెందరో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు అనేక రంగాలు శరవేగంగా విస్తరిస్తున్న నేటి ఆధునిక విజ్ఞాన కాలంలో మనదేశంలోని యువత కూడా ఆయా రంగాల్లో నైపుణ్యాలతో రాణించేందుకు, ప్రతిభతో అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు తగ్గ వనరులు, అందుకనువైన మార్గాలు ఆశించిన స్థాయిలో పుష్కలంగా లేకపోవడం ఈ దుస్థితికి ప్రధాన కారణంగా ఉంటోంది. ఆయా రంగాల్లో నైపుణ్యాలు సాధించిన ఏ కొద్దిమందికో అదృష్టవశాత్తూ మంచి అవకాశాలు లభిస్తున్నప్పటికీ ఎంతోమంది చదువుకున్న యువతకు సరైన నైపుణ్యాలు కొరవడ డంతో అలాంటి ఉన్నతమైన ఉద్యోగాలకు నోచుకోలేక పోతున్నారు. కొన్ని రాష్ట్రాల్లో అక్కడక్కడా పరిశ్రమల రంగంలోనూ, సాంకేతిక రంగం..విద్య, వైద్య రంగాలు తదితర ప్రాముఖ్యత ఉన్న ఎన్నో రంగాల్లో ఉద్యోగావ కాశాలు కలిగిస్తూ మంచి నైపుణ్యం, ప్రతిభా పాటవాలు కలిగిన యువతను ఎంపిక చేసుకుంటున్నా అలాంటి అవకాశాలు అన్నిప్రాంతాల్లో అందరికీ అందడం లేదు. ఆ లోటును గమనించి ప్రభుత్వాలు అలాంటి అస్తవ్యస్త పరిస్థితులను సరిదిద్దాల్సి ఉంది. యువత లోని ప్రతిభకు మెరుగులు దిద్ది అందరికీ ఉద్యోగావ కాశాలు కలిగేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు, పాలకులు స్పందించి యువతకు ఆయా రంగాల్లో వారు అత్యుత్తమ ప్రతిభాపాటవాలతో, సాటిలేని నైపుణ్యంతో రాణించేలా శిక్షణ ఇచ్చి వారికి మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు వారు దేశాభ్యున్నతికి పాటుపడేవిధంగా తయారుచేయాల్సి ఉంది. యువత ఉద్యోగాలను అభ్యర్థించే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చేందుకు కేంద్రం చేపట్టిన 'నైపుణ్య భారత్', 'స్టార్టప్' వంటి బృహత్తర పథకాలు మరింత వేగాన్నందుకుని నిరుద్యోగాన్ని పూర్తిస్థాయిలో జయించే దిశలో యువతను ముందుకు నడిపించాల్సి ఉంది. దేశజనాభాలో అత్యధికంగా దాదాపు 80 కోట్ల మందికి పైగానే ఉన్న యువతకు ఈ కరోనా కష్టకాలాన్ని అధిగమించేందుకు సరికొత్త ఉత్సాహ ప్రోత్సాహాలను అందించాలి. అధునాతన సాంకేతిక నైపుణ్యాలతో, ప్రతిభాపాటవాలతో రాణించేలా సహకరించి వారి ఉద్యోగ జీవితాలకు భరోసా కల్పించి, తద్వారా యువత భవితకు బంగారు బాటలు వేయాల్సి ఉంది. జాతి నిర్మాణంలో యువత పురోగమించి దేశాభివృద్ధికి తోడ్పడేవిధంగా వారికి పూర్తిస్థాయిలో చేయూతనందించాల్సి ఉంది.

# చివరకు ఆయనొక్కరే మిగులుతారేమో!

అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ పదవీ కాలం చివరి రోజుల్లోకి వచ్చింది. అయినా, మిగిలి ఉన్న ఈ ఐదారు రోజుల్లో ఆయన ఏమి వీరంగం వేస్తాడో అని అమెరికన్ సమాజం గడగడలాడిపోతున్నది. రోజుకొకర్ని ఆయన పీకి పారేస్తున్నాడు. ఇక్కడ ఆంధ్ర లోనూ మనకు అటువంటి అనుభవమే ఒకటి ఎదురవుతున్నది. ఆయనే నిమ్మగడ్డ రమేష్‌కుమార్. రాష్ట్ర ఎన్నికల కమిషనర్. 2015 ఏప్రిల్ ఒకటిన ఆయన ఆ పదవిలో నియమితులయ్యారు. రాష్ట్రంలో లోకల్ బాడీస్, పంచాయితీ ఎన్నికలు వంటివి సమయం ప్రకారం నిర్వహించడం ఆయన ముఖ్యవిధి. హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి హోదా, జీతభత్యాలు, హంగు-ఆర్భాటం, ఆఫీసు, సిబ్బంది, సెక్యూరిటి వగైరా అన్నీ ఉంటాయ్.



చివరిసారిగా మన రాష్ట్రంలో, అప్పటి ముఖ్య మంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. 2018లో వాటి కాలపరిమితి ముగిసింది. 2015లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నిమ్మగడ్డ రమేష్‌కుమార్, ఈ ఎన్నికలను 2018లోనే నిర్వహించవలసి ఉంది. కానీ, నిర్వహించ లేదు. ఎందుకంటే- 2019లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు నిర్వహిస్తే.. ఒకవేళ తెలుగుదేశం గనుక ఈ ఎన్నికల్లో చీదేస్తే అసెంబ్లీ ఎన్నికల్లో ఫినిష్ అయి పోతామని చంద్రబాబు భయపడ్డారు. అందుకని, నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఎన్నికలు నిర్వహించలేదు.




గుర్రం గుడ్డిదైనా... దాణా తప్పదన్న సామెత చందంగా- 2018లో నిర్వహించాల్సిన ఎన్నికలు నిర్వహించక పోయిన ప్పటికీ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌పై నెలవారీ లక్షలాది రూపాయల ఖర్చుమాత్రం ప్రభుత్వానికి తప్పలేదు.

2019లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అందరూ ఊహించినట్టుగానే తెలుగుదేశంను ఓటర్లు కుళ్లబొడిచారు. 175 సీట్లకుగాను 23 వచ్చాయి. 151 సీట్లతో అధికారం చేపట్టిన జగన్ ప్రభుత్వం- నిరుడు, 2020లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భావించింది. కానీ, రమేష్‌కుమార్ అడ్డం తిరిగిపోయారు. నామినేషన్ల ప్రక్రియ కూడా పూర్తయిన తరువాత కరోనాను సాకుగాచూపి ఎన్నికల ప్రక్రియను నిరవధికంగా వాయిదా వేసిపారేశారు. అప్పటికి 10 కరోనా కేసులు కూడా రాష్ట్రంలో నమోదు కావడం లేదు.

కానీ, ఇప్పుడు ప్రతిరోజూ వందల్లో కరోనా కేస్‌లు నమో దవుతున్నాయి. వాటికితోడు, వాక్సిన్ కూడా వచ్చేసింది. పండుగ వెళ్లగానే, 16వతేదీ నుంచి వాక్సిన్ వేయడం మొదలుపెట్టాలి. ముందు ఇది చూడాలి కదా... నాల్రోజులు ఆగండి స్వామీ అంటే... ఆయన, 'లేదు.. లేదు.. ఇప్పటికిప్పుడు ఎలెక్షన్లు జరపకపోతే.. రాజ్యాంగం నన్ను ఊరు కోదు' అంటూ నోటిఫికేషన్ జారీ చేసేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇక చేసేదేమీలేక, హైకోర్టుకు వెళ్ళింది. ప్రభుత్వం చెబుతున్నది కరెక్టుగానే ఉందిగా అంటూ- ఎన్నికల నోటిఫికేషన్ కోర్టు పక్కనపెట్టేసింది. నిముషాల మీద నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అప్పీల్‌కు వెళ్లారు.

ఈలోపు తన ఆఫీస్‌లో పనిచేసే జేడీ సాయిప్రసాద్‌ను ఇంటికి పంపే శారు. తరువాత కమిషన్ కార్య దర్శిగా పనిచేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి వాణీమోహన్‌ను బయటికి పంపేశారు. ఆయన పదవీ కాలం ఉన్నది మరో రెండు నెలల 20 రోజులు. ప్రస్తుతం ఆయన స్పీడ్ చూస్తుంటే- రోజుకు ఒకరు, ఇద్దర్నీ బయటకు పంపేటట్టు కనబడుతున్నారు. చివరికి వచ్చే సరికి ఆయన ఒక్కరే మిగులుతారేమో అనిపిస్తున్నది. ఆయనది ఎంత రాజ్యాంగ అధికారమో.. రాష్ట్రప్రభుత్వ అధికారమూ అంతే రాజ్యాంగ ప్రసాదితం. ఆ విషయం ఆయన గమనంలోకి తీసుకోకుండా వాళ్లను తీసేయ్...వీళ్లను తీసేయ్ అంటూ తనను తానే తీసేసుకుని హైదరాబాద్ వెళ్లిపోతారేమో అనిపిస్తున్నది. ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని కాదని ఏ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి కూడా కమిషన్ ఆఫీస్‌లో మనస్ఫూర్తిగా విధులు నిర్వహించలేరు. వాళ్లకు ఉద్యోగాలు కావాలి. నువ్వు కాదు. రెండునెల్ల ఇరవై రోజుల తరువాత-'అసలు నువ్వెవరు?'

**- భోగాది వేంకటరాయుడు**

# ఐకమత్యం చాటారు

ఈ-మెయిల్ ప్రజావాణి lawyerpatrika@gmail.com

జనవరి 11వతేదీ ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నెల్లూరుకు వచ్చిన తరుణంలో జిల్లాలోని ఇద్దరు మంత్రులతో పాటు ఇతర 8మంది శాసనసభ్యులు నెల్లూరు పార్లమెంటు సభ్యుడూ అందరూ కలసి కార్యక్రమాన్ని ఘనవిజయం చేయడం అభినందించ తగ్గ విషయం. 2019లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి వీళ్ళందరూ ఒకే వేదికపైకి వచ్చి కలిసిన సంఘటనే లేదు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల గురించి చర్చించడానికి పార్టీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి నెల్లూరుకు వచ్చిన తరుణంలో కూడా పరిశ్రమల మంత్రి గౌతమ్‌రెడ్డి ఇంట్లో అందరూ కలవడం పార్టీ వర్గాల్లో ఉత్సాహం నింపింది. ఇలాంటి కలయిక కోసమే పార్టీ శ్రేణులు ఎప్పటినుండో ఎదురు చూస్తున్నారు, ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా అందరూ ఒక్క తాటిపై నడిస్తే జిల్లాలో మళ్ళీ 10 సీట్లూ వైసీపీవే.

**ఆర్.పి. రామయ్య, కొండాయపాలెం.**

## కరోనా నుండి కాపాడిన

# భారతీయుల అలవాట్లు.. జీవన శైలి

ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి బారిన పడకుండా అధిక శాతం భారతీయులు తప్పించుకున్నారంటే అందుకు కారణం మన భారతీయుల అలవాట్లు, జీవన శైలే. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోగల శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం భారతీయులలో ఎక్కువ. ఈ రెండు అంశాలే కరోనా బారినుండి ఇండియన్స్‌ని రక్షించాయి. మన పూర్వీకులు మనకు అందించిన ఆహారపు అలవాట్లు, వ్యాయామం మనల్ని ఎప్పుడూ రక్షిస్తూనే ఉంటాయి. భారత్ మినహా ఇతర అనేక దేశాలలో ఇప్పటికీ కరోనా మహమ్మారి దెబ్బకి అక్కడ ప్రజలు వణికిపోతుంటే ఒక్క భారతదేశంలోనే పూర్తిగా భయం పోయి సాధారణ జనజీవన పరిస్థితులు నెలకొన్నాయి. లాక్‌డౌన్‌కి ముందు పరిస్థితులు ఎలా ఉండేవో అంతేస్థాయిలో ఇప్పుడు భారతీయులు తమ జీవనం కొనసాగిస్తున్నారు. ఇక ఇప్పుడు కోవిడ్ టీకా అందుబాటులోకి రావడంతో అతి పెద్ద మహమ్మారి బారినుండి మన దేశం తప్పించుకున్నట్లే. మన అలవాట్లు, జీవనశైలే మనకు శ్రీరామ రక్ష అయ్యాయి.

**బి.జి.వనజ, గూడూరు.**

# మాయదారి వానలు.. మళ్ళీ కొంపముంచాయి

*గత ఏడాది చివరలో నివర్, బువేరి తుఫానులు... భారీ వర్షాలు వచ్చి వెళ్లిపోయాయి కదా.. కొత్త ఏడాదైనా ఏ విపత్తులు లేకుండా ఉంటాయని ఆశించిన రైతుల ఆశలు నిరాశలయ్యాయి. ఈ ఏడాది జనవరి మొదటి వారంలోనే వరుణుడు పగబట్టినట్టు వానలు దంచేస్తుండడంతో పొలాలు దెబ్బతిని రైతులు విలవిల్లాడుతున్నారు. గత 6,7 తేదీల్లో కేవలం రెండు రోజుల్లోనే ఈ వర్షాల ధాటికి దాదాపు 6వేల హెక్టార్లకు పైగానే పంటలకు నష్టాలు వాటిల్లివుండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత రెండు రోజులు కూడా చెదురుమదురు వానలొచ్చాయి. ఈ నష్టాలు ఎప్పటికి పూడుతాయోనంటూ రైతులు దిగాలుపడిపోతున్నారు.*

- కొత్త ఏడాదిలోనూ వాన కష్టాలే
- వేలాది హెక్టార్లలో పంట నష్టం
- కన్నీళ్ళు పెట్టుకుంటున్న రైతులు



జిల్లాలో గత కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు రైతుల్ని బెంబేలెత్తిస్తున్నాయి. మొన్నటి నష్టాలను ఈసారైనా ఎలాగో పూడ్చుకుందామని, చేసిన అప్పులు కొంతైనా తీర్చుకుందామని ఎంతో ఆశతో దుక్కులు దున్ని నాట్లు వేసుకున్న రైతులు..ఇప్పుడిప్పుడే పొట్టకొచ్చిన వరిపైర్లను చూసి ఆనందపడ్డారు. కానీ అంతలోనే మళ్ళీ అకాల వర్షాలు వచ్చి పడ్డాయి. ఇక కొద్దిరోజుల్లోనే చేతికందుతుందనుకున్న పైర్లు నీట మునగడంతో అన్నదాతలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. మరో నాలుగైదు వారాల్లోనే పంట చేతికి వస్తుందనుకున్న దశలో జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు రైతుల ఆశలపై నీళ్ళు చల్లుతున్నాయి. అసలే కుయ్యో మొర్రోమంటున్న రైతులు..మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా ఈ వానల దెబ్బకు పడుతుండే బాధలు వర్ణనాతీతం. పలు మండలాల్లో కురుస్తున్న కుండపోత వానతో పంటలు నీట మునిగి చేసిన కష్టమంతా గంగపాలవుతోంది. వేలాది ఎకరాల్లోని వరిపైర్లతో పాటు వేరుశనగ, పచ్చిశనగ, మినుము, మిరప, కూరగాయల పంటలు వగైరాలన్నీ ఈ వర్షాలకి బాగా దెబ్బతిన్నాయి. సూళ్ళూరుపేట, దొరవారి సత్రం, గూడూరు, ఓజిలి, చిల్లకూరు, చేజర్ల, కలువాయి, మర్రిపాడు, సైదాపురం, కలిగిరి, పొదలకూరు, రాపూరు, వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, వెంకటాచలం తదితర మండలాల్లో పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఒక్క దొరవారిసత్రం మండలంలోనే సుమారు రెండువేల హెక్టార్లకు పైగా వరిపైర్లు నీట మునిగాయని ఆ ప్రాంత రైతులు వాపోతున్నారు. పాలు పోసుకున్న వర్షం దెబ్బతో వరికంకులు నేలరాలిపోయాయి. నేలవాలిన పంటలు చూసి రైతులు దిగాలుపడిపోతున్నారు. కొన్నిచోట్ల పంటచేలన్నీ నీళ్ళ మడుగుల్లా, పెద్ద చెరువుల్లా కనిపిస్తున్నాయి.

### సోమశిలకు భారీగా వరద ప్రవాహం

జిల్లాలోని రైతులకు ప్రాణప్రదమైన సోమశిల జలాశయంలో భారీగా వరద నీళ్ళు వచ్చి చేరుతున్నాయి. ప్రస్తుతం 76.348 టిఎంసిల నీటి నిల్వంతో సోమశిల జలాశయం నిండుకుండలా ఉంది. అకాల వర్షాలకు పైతట్టు ప్రాంతాల నుంచి వరద నీళ్ళు ప్రవాహంలా వస్తూనే ఉన్నాయి. ఈనెల మొదటివారంలో కురిసిన వర్షాలకు రోజుకు 24వేల క్యూసెక్కుల దాకా వరద ప్రవాహం వచ్చిందని అధికారులు చెప్తున్నారు. దీంతో కొంత నీటిని వదిలేయడంతో సంగం ఆనకట్ట వద్ద నీటిమట్టం పెరిగింది. పెన్నా నది నీటి ప్రవాహంతో కళకళలాడింది.

### నీటమునిగిన పంటలు.. ఆవేదనలో అన్నదాతలు

ఈ అకాల వర్షాల వల్ల జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయని, ఈ నెల 4 నుంచి వానలు వదలడం లేదని, పంటలు నీళ్ళలో నానిపోతుండడంతో దిగుబడి తగ్గిపోతుందని, అరాకొరా పంట చేతికి మిగిలినా గింజలు నల్లబడి నాణ్యత కోల్పోతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించుకుంటున్న పంటలు ఇంకొద్దిరోజుల్లోనే చేతికి వస్తాయని ఎంతో ఆశతో ఉంటే ఇప్పుడీ మాయదారి వానలొచ్చి కొంప ముంచాయని నష్టాల పాలైన రైతులు గోడుగోడుమంటున్నారు. ఈ వానలు ఎప్పుడు ఆగుతాయి భగవంతుడా.. అని పంటలు వేసుకుని కోతలకు ఎదురుచూస్తున్న రైతులు వేయి దేవుళ్ళకు మొక్కుకుంటున్నారు.

---

## భారతీయ భాషల విశ్వవిద్యాలయంలో...

# ప్రాచీన తెలుగు భాషా కేంద్రాన్ని విలీనం చేయొద్దు

**- కేంద్రప్రభుత్వానికి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విజ్ఞప్తి**



భారతీయ భాషల విశ్వవిద్యాలయంలో ప్రాచీన తెలుగు భాష విశిష్ట అధ్యయన కేంద్రాన్ని కలపవద్దని ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఒక ప్రకటనలో కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మైసూరులోని భారతీయ భాషా సంస్థను భారతీయ భాషల విశ్వవిద్యాలయంగా మార్చడానికి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ సంస్థను ఏర్పాటు చేయడానికి భారత ప్రభుత్వం నిర్ణయించి అందుకు 11 మంది సభ్యులతో కూడిన కమిటీని కూడా నియమించిందని, అయితే ప్రాచీనభాషగా గుర్తింపు పొందిన తెలుగు భాషకు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఏ ఒక్కరినీ ఆ కమిటీలో సభ్యులుగా నియమించకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం ప్రాచీన భాషల అభ్యున్నతి కోసం తమిళం, సంస్కృతం, తెలుగు, కన్నడ, మలయాళ, ఒడిశా భాషలకు ప్రాచీనహోదా ప్రకటించి అమలు చేస్తోందని, తమిళం, సంస్కృత భాషలకు స్వయంప్రతిపత్తిని ఇచ్చిందని, ఢిల్లీలో సంస్కృతం, చెన్నైలో తమిళ సంస్థలు స్వయంప్రతిపత్తితో పనిచేస్తున్నాయని, తెలుగు కన్నడ ఒడియా భాషా కేంద్రాలు మాత్రం భారతీయ భాషా సంస్థలో భాగంగానే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మైసూరులో కన్నడ కేంద్రం, నెల్లూరులో తెలుగు కేంద్రం, భువనేశ్వర్‌లో ఒడియా కేంద్రం, కేరళలోని మలయాళ విశ్వవిద్యాలయంలో మలయాళ కేంద్రం పనిచేస్తున్నాయని ఆయన వివరిస్తూ, నెల్లూరులోని ప్రాచీన తెలుగుభాష విశిష్ట అధ్యయన కేంద్రాన్ని భారతీయ భాషల విశ్వ విద్యాలయంలో కలపడం వల్ల తెలుగు కేంద్రం స్వయంప్రతిపత్తిని కోల్పోవడమే కాకుండా అభివృద్ధి కుంటుపడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి కేటాయించాల్సిన నిధులు కూడా విశ్వ విద్యాలయ పరిధిలోకి వెళ్ళి కుదించుకుపోయే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో తెలుగు శాఖలు చాలా పనిచేస్తున్నాయని, అదేవిధంగా హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలోను, అనంతపురంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలోనూ తెలుగు శాఖలు ఉన్నాయని, వీటిలో బోధన ప్రధానంగా, పరిశోధన పరిమితంగా ఉంటుందని, ఆ విశ్వవిద్యాలయాలు ఎంఫిల్, పిహెచ్‌డి డిగ్రీల కోసం విద్యార్థులు చేసే పరిశోధనలకే పరిమితమవుతున్నాయని, వాటిల్లో ప్రచురణ కూడా అంతంతమాత్రంగానే జరుగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాచీన తెలుగు భాష విశిష్ట అధ్యయన కేంద్రాన్ని భారతీయ భాషల విశ్వవిద్యాలయంలో కలపడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందని, రెండేళ్ళ క్రితం ఏర్పడిన ఈ కేంద్రంలో ఏడు బాహ్య ప్రాజెక్టులు పూర్తై, ఒకటి ముద్రితమైందని, మిగిలిన వాటి ముద్రణ చేపట్టాల్సి ఉందని, అదే విధంగా అంతర్గత ప్రాజెక్టులు ఏడు పూర్తి కాగా వాటిని కూడా త్వరలో ముద్రించాల్సి ఉందని, మరో నాలుగు బాహ్య ప్రాజెక్టులు పరిశీలనలో ఉన్నాయని ఆయన వెల్లడించారు.

### ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రాన్ని నెల్లూరులోనే కొనసాగించాలి

ప్రాచీన తెలుగుభాష విశిష్ట అధ్యయన కేంద్రం తన లక్ష్యాలకు అనుగుణంగా శాసనాలు చదవడం, తాళపత్రాలు పరిష్కరించడం, తెలుగు సాహిత్య అధ్యయనం గురించి శిక్షణా తరగతులను నిర్వహించడం వంటి కార్యక్రమాలను చేపట్టిందని, భావితరాల వారికి ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని యార్లగడ్డ అన్నారు. ఈ కేంద్రం లక్ష్యాలను విశ్వవిద్యాలయాల ద్వారా సాధించడం ఆచరణలో సాధ్యంకాదని, ఈ కేంద్రాన్ని స్వయంప్రతిపత్తి కేంద్రంగానే ఉంచాలని కోరారు. ముఖ్యంగా ఇది తెలుగువారి ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని, ఎన్నో ఉద్యమాలు చేసిన తర్వాత కేంద్రప్రభుత్వం 2008లో తెలుగుభాషకు ప్రాచీన హోదా ఇచ్చి ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని మైసూరులో ఏర్పాటు చేసిందని, అయితే ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవతో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నాలతో ఈ కేంద్రం మైసూరు నుండి నెల్లూరుకు వచ్చిందని ఆయన వివరించారు. నెల్లూరు కేంద్రంగా ఎంతో వేగంగా సారస్వత పరిశోధనలు నిర్వహిస్తున్న ఈ కేంద్రానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అయిదెకరాల రాష్ట్ర ప్రభుత్వభూమిని కేటాయించారని, ఇప్పుడు మళ్ళీ దీనిని మైసూరులో నెలకొల్పే భారతీయ భాషల విశ్వవిద్యాలయంలో కలపడం ఆత్మహత్యాసదృశమని, అందుచేత నెల్లూరులోని ఈ కేంద్రానికి స్వయంప్రతిపత్తిని కల్పించి నెల్లూరులోనే కొనసాగించాలని ఆయన కోరారు.







# నెల్లూరు కబుర్లు

## ఆర్టీసికి సంక్రాంతి రాబడి

సంక్రాంతి పండుగలు ఆర్టీసికి కలిసొచ్చాయి. పండుగ సెలవుల్లో ప్రయాణీకులు తమ స్వస్థలాలకు పయనం కావడంతో హైదరాబాద్‌కు 12 బస్సులు, విశాఖకు 7, బెంగుళూరుకు 5 బస్సులతో పాటు 35 ప్రత్యేక బస్సులు నడిపామని, గ్రామీణ ప్రాంతాలకు అన్ని బస్సులు నడిచాయని, నెల్లూరు రీజియన్ పరిధిలో ఉన్న 850 బస్సులు నడవడంతో ఆర్టీసికి 95 లక్షల దాకా రాబడి వస్తుందని ఆర్టీసి అధికారులు అంచనా వేస్తున్నారు. సంక్రాంతి పండుగలకు ప్రయాణీకుల రద్దీ ఎక్కువ కావడంతో పాటు, అదేరోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 'అమ్మ ఒడి' కార్యక్రమం కోసం నడిపిన బస్సుల ద్వారా ఆర్టీసికి సుమారు పాతిక లక్షల దాకా రాబడి వచ్చిందని, దీంతో సోమవారం ఒక్కరోజే 1.17 కోట్ల దాకా వచ్చిందని ఆర్టీసి ఆర్ఎం పివి శేషయ్య తెలిపారు.

## బిజెపి గూటికి చేరిపోయారు



నెల్లూరు శివార్లలో ఉన్న కనుపర్తిపాడుకు చెందిన గీతాంజలి ఆధ్వర్యంలో సుమారు 50మంది ఈనెల 11న బిజెపి గూటికి చేరిపోయారు. వీరందరికీ బిజెపి నాయకుడు భరత్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. అయోధ్య రామమందిరం నిర్మాణానికి అందరూ విరాళాలివ్వాలని ఆయన కోరారు. బిజెపి నాయకురాలు కామేశ్వరమ్మ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు రాధాకృష్ణ, బి.శ్రీనివాసులు, బుజ్జిరెడ్డి, యశ్వంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### భరతజాతి...

## ఔన్నత్యాన్ని చాటిన స్వామి వివేకానంద




భరతజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద అని నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, ఏపి యుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్ కొనియాడారు. ఈనెల 11న ఆయన నెల్లూరులోని ములుముడి బస్టాండ్ వద్ద సామాజిక సమరసతా వేదిక ఏర్పాటుచేసిన స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా యువతకు దశ-దిశ నిర్దేశించిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని, ఆయన జీవితం..ఆశయాలు అందరికీ మార్గదర్శకమని అన్నారు. సామాజిక సమరసతా వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బూదూరి కేశోరామ్, లక్ష్మీనారాయణరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు. తొలుత వక్తలందరూ స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### పునర్విభజనలో...

## జిల్లాకు నష్టం జరగకుండా చూడాలి

**ప్రభుత్వానికి సిపిఐ నాయకుల వినతి**

రాష్ట్రంలో చేపట్టే జిల్లాలో పునర్విభజనలో నెల్లూరుజిల్లాకు నష్టం జరగకుండా చూడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకుడు రామరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఈనెల 10న వారు నెల్లూరులోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జిల్లాల విభజన జరిగితే నెల్లూరు జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎంతో ముఖ్యమైన కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటీ, మేనకూరు సెజ్, శ్రీహరికోట, మాంబట్టు పారిశ్రామికవాడ, నేలపట్టు, పులికాట్ సరస్సు తదితర వాణిజ్య, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాలు నెల్లూరు జిల్లా నుంచి విడిపోయి తిరుపతి పరిధిలోకి వెళ్లిపోతాయని, అందువల్ల జిల్లా ప్రజలు కోరుకుంటున్నట్లుగా జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్న ప్రాంతాలను జిల్లాలోనే కొనసాగించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# కరోనాపై యుద్ధం... కోవిడ్ టీకా సిద్ధం

**● పంపిణీకి సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం**

జనమంతా ఎప్పుడెప్పుడా అని వేయికళ్ళతో ఎదురుచూస్తున్న కరోనా నివారణ టీకా ఎట్టకేలకు ఈనెల 12వ తేది రాత్రి విజయవాడలోని గన్నవరం విమానాశ్రయం నుంచి జిల్లాకు వచ్చేసింది. ఈనెల 16న వ్యాక్సిన్ పంపిణీకి జిల్లా అధికారయంత్రాంగం సమాయత్తమవుతోంది. జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు సారథ్యంలో వైద్యఆరోగ్యశాఖ అధికారులు అందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి దశలో రిజిస్ట్రేషన్ చేసుకున్న 30వేల మందికి ఫ్రంట్‌లైన్ వారియర్స్‌కు 26 కేంద్రాల్లో ఈ వ్యాక్సిన్ ఇచ్చేందుకు అంతా సిద్ధమవుతున్నారు. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారి వ్యాధిని కట్టడి చేసేందుకు మనదేశంలోని పుణేలో ఉన్న సీరమ్ సంస్థ అత్యద్భుతమైన రీతిలో కోవిషీల్డ్ వ్యాక్సిన్‌ను తయారుచేసింది. కేంద్రప్రభుత్వం దీనిని దశలవారీగా ప్రజలకు వేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మంగళవారం పటిష్టమైన బందోబస్తు మధ్య ఈ టీకాను నెల్లూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేర్చారు. తొలి విడతగా ఈ వ్యాక్సిన్‌ను క్షేత్రస్థాయిలో పనిచేస్తూ సేవలందిస్తున్న ప్రభుత్వ,



ప్రైవేట్ వైద్య సిబ్బందితో పాటు అంగన్‌వాడీ వర్కర్లకు మాత్రమే ఈనెల 16వ తేదీన ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ వ్యాక్సిన్ కోసం 30 వేల మంది రిజిస్టర్ చేసుకున్నారని తెలుస్తోంది. జిల్లాలో 26 కేంద్రాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యాక్సిన్ వేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### కెవి చలమయ్యకు

## మరో పదవి



నెల్లూరుకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఏపి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కెవి చలమయ్యకు వైశ్య సంఘంలో మరో ఉన్నత పదవి లభించింది. సదరన్ ఇండియా వైశ్య అసోసియేషన్-చెన్నై కార్యవర్గ సభ్యునిగా జిల్లా నుంచి ఆయన ఎన్నిక కావడం విశేషం. ఈ కొత్త పదవి ద్వారా వైశ్యులకు మరింత సేవచేసేందుకు సదరన్ ఇండియా వైశ్య అసోసియేషన్-చెన్నై సంస్థకు కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకోవడం పట్ల ఆయనొక ప్రకటనలో తన కృతజ్ఞతలు చెప్పారు.

## రెండుకు తగ్గిన కోవిడ్

జిల్లాలో కోవిడ్ వైరస్ బాధితుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ తాజాగా ఆ సంఖ్య రెండంకెల నుంచి ఒక్క అంకెకి చేరింది. ఈనెల 13న ఒక్కరోజులో జిల్లాలో 3379 మందికి వైద్యశాఖ అధికారులు కోవిడ్ పరీక్షలు చేస్తే అందులో కేవలం ఇద్దరికి మాత్రమే కరోనా నిర్ధారణ అయింది. అయినా వ్యాధి లక్షణాలు కూడా తక్కువగానే ఉన్నాయి. వారిని హోం ఐసొలేషన్లలో ఉంచి వైద్యులు చికిత్సలందిస్తున్నారు. కరోనా వ్యాధితో చికిత్స పొందుతూ కోలుకున్న మరో 10 మందిని వైద్యులు డిశ్చార్జి చేశారు. దీంతో ఇప్పటి దాకా జిల్లాలో ఈ వ్యాధి బారిన పడిన వారి సంఖ్య 63,805 కాగా, వైద్యుల చికిత్సలతో కోలుకున్న వారి సంఖ్య 63,383కు చేరుకుంది. ఈ వ్యాధితో 588 మంది మృతిచెందగా, మిగిలిన 422 మంది నెల్లూరు నగరంలోని పెద్దాసుపత్రిలోను, హోం ఐసొలేషన్లలోను చికిత్స పొందుతున్నట్లు వైద్యవర్గాలు పేర్కొన్నాయి.

### డికెడబ్ల్యులో

## 17 దాకా అడ్మిషన్లు

నెల్లూరులోని డికె ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈనెల 17వ తేది వరకు అడ్మిషన్లు ఉంటాయని కళాశాల ప్రిన్సిపాల్ మస్తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో ధరఖాస్తులు చేసుకోవడంలో అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నవారికి ఈనెల 12న అవగాహన సదస్సు కూడా నిర్వహించామన్నారు.

### లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో

## ముగ్గుల పోటీలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు సేవాప్రియ ఆక్సలరీ ఆధ్వర్యంలో నెల్లూరు బాలాజీనగర్‌లో ఉన్న వృద్ధాశ్రమంలో ఈనెల 11న ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఎంతో ఉత్సాహంతో పెద్దసంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొని ముగ్గులు వేశారు. విజేతలైనవారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. లయన్స్‌క్లబ్ ఎడ్యుకేషన్ కమిటీ ఛైర్మెన్ సతీష్‌కుమార్, అధ్యక్ష కార్యదర్శులు రామానుజం, కృష్ణకుమారి, సిడిజె కిషోర్, అమృతవల్లి, ప్రవీణ్‌శంకర్ పాల్గొన్నారు.

## పెన్షనర్లకు సౌలభ్యం

జిల్లాలోని ప్రభుత్వ పెన్షనర్లు వారి లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించడానికి కొందరు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ పెన్షనర్లకు తమవంతు సేవలందించడానికి సిద్ధమైంది. పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించడానికి నెల్లూరులోని భక్తవత్సలనగర్‌లో ఉన్న పెన్షన్ భవనంలో తగు ఏర్పాట్లు చేశామని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పి.మోహన్‌రావు, టి.కొండాచారి ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ప్రభుత్వ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించవచ్చుని, పెన్షనర్లు సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు, పెన్షన్ బుక్, బ్యాంక్ పాస్‌బుక్‌లతో రావాలని కోరారు.

## పల్స్‌పోలియో వాయిదా

ఈనెల 17వ తేది నుంచి చేపట్టాలనుకున్న చిన్నారులకు పల్స్‌పోలియో కార్యక్రమం వాయిదా పడినట్లు డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పోలియో వ్యాధిని దేశం నుంచి తరిమికొట్టేందుకు ఏటా జనవరి నెలలో ప్రభుత్వం అయిదేళ్ళ లోపు పిల్లలందరికీ పోలియో చుక్కల మందును వేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే కరోనా మహమ్మారిని నివారించేందుకు టీకా వేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

## బీద రవిచంద్ర పుట్టినరోజు వేడుకలు



టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పుట్టినరోజు వేడుకలు ఈనెల 11న నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. టిడిపి ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు శ్రీపతిబాబు ఆధ్వర్యంలో కేకు కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. పార్టీకి ఎంతోకాలంగా బీద రవిచంద్ర చేస్తున్న సేవలను అందరూ కొనియాడుతూ భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత పదవులను అందుకోవాలని ఆకాంక్షించారు. టిడిపి నాయకులు కొల్లూరు బాలకృష్ణచౌదరి, ఆనం సురేష్, నెల్లూరు మురళి, జి.సుశీలమ్మ, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ప్రణయ్‌రెడ్డి, ఉయ్యాల రవీంద్ర, కోలగట్ల శ్రీదేవి, మంగమ్మ పాల్గొన్నారు.

## తుర్లపాటికి గ్రంథాలయ ఉద్యోగుల నివాళి



ప్రముఖ పత్రికా సంపాదకుడు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు తుర్లపాటి కుటుంబరావు మృతి బాధాకరమని విచారం వ్యక్తం చేస్తూ ఈనెల 11న నెల్లూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు నివాళులర్పించారు. తుర్లపాటి సంతాప సభ ఏర్పాటుచేసి తుర్లపాటి సేవలను అందరూ గుర్తుకు తెచ్చుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వరప్రసాద్ అధ్యక్షత వహించారు. సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి మాట్లాడుతూ తుర్లపాటి జనచైతన్యానికి చేసిన కృషి అద్భుతమని, ఆయన సేవలు పాత్రికేయులకు ఆదర్శమని కొనియాడారు.

## ఎస్ఐ మృతికి సంతాపం

జిల్లాలో కానిస్టేబుల్‌గా, ఏఎస్ఐగా పనిచేసి ఇటీవలే ప్రకాశం జిల్లా సిసిఎస్‌కు బదిలీ అయిన ఎస్ఐ పోలయ్య ఈనెల 10వ తేది రాత్రి నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతిచెందారు. స్వస్థలమైన అల్లూరు మండలంలోని శంభునిపాళెం గ్రామంలో పోలీసు లాంఛనాలతో ఈనెల 11న ఆయన అంత్యక్రియలు జరిగాయి. పోలయ్య మృతి ఎంతో బాధాకరమని అంటూ జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకులు మద్దిపాటి ప్రసాద్, శ్రీహరి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

# ఈ తరం మేటి.. సాహిత్యంలో తనకు తానే సాటి.. మన వెన్నెలకంటి

## - సంస్మరణ సభలో 'లాయర్' అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి



ప్రఖ్యాత సినీకవులు మనసు కవి ఆత్రేయ, సహజకవి ఎంఎస్ రెడ్డి (మల్లెమాల సుందరరామిరెడ్డి)ల తర్వాత అంతటి సమున్నత స్థానం పొందిన ప్రముఖ సినీకవి, మన నెల్లూరీయుడు వెన్నెలకంటి రాజేశ్వర ప్రసాద్ అని, మంచి కవిగా, పాటల-మాటల రచయితగా తెలుగు సినీరంగంలో రాణిస్తూ ఖ్యాతిగాంచిన వెన్నెలకంటి మృతి ఎంతో బాధాకరమని 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి అన్నారు. దేవుడి దగ్గరకి భక్తుడు, గురువు వద్దకు శిష్యుడు వెళ్ళిపోయినట్లుగా.. తనకు గురువు.. దైవమైన గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వద్దకు అన్నయ్యా.. అంటూ వెతుక్కుంటూ తమ్ముడు వెన్నెలకంటి కూడా వెళ్ళిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 10న నెల్లూరులోని హోటల్ అతిథిగ్రాండ్‌లో డా.నాగభైరవ అవార్డు కమిటీ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ కవి చిన్ని నారాయణరావు, కళాంజలి అనంత్‌ల ఆధ్వర్యంలో వెన్నెలకంటి సంస్మరణ జరిగింది. పలువురు కవులు, వెన్నెలకంటి అభిమానులు, కళాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని వెన్నెలకంటికి నివాళులర్పించారు.

### గానం - గీతం వెళ్లిపోయాయి

సభకు 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. వెన్నెలకంటి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నెల్లూరుకే కాక తెలుగు పాటకు విశ్వవిఖ్యాతిని తెచ్చిన బాలు- గీత రచయితగా ఎంతో ప్రఖ్యాతిచెందిన వెన్నెలకంటి ఇలా..ఒకరి తర్వాత మరొకరుగా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడం ఎంతో బాధ కలిగిస్తోందని, గత ఏడాది సెప్టెంబర్ 25న బాలు మరణించగా, ఈ ఏడాది జనవరి 5న వెన్నెలకంటి మృతిచెందారని, కేవలం వంద రోజుల వ్యవధిలోనే వీరిద్దరి మరణం సినీరంగంతో పాటు ప్రత్యేకించి నెల్లూరీయులను ఎంతగానో కలచివేసిందని అన్నారు. గేయం - కవిత్వం - నాటకం - పద్యం - సినీ గీతాల రచన వంటి సాహితీ ప్రక్రియల్లో తనదంటూ ఒక ప్రత్యేక ఒరవడిని వెన్నెలకంటి సృష్టించుకున్నారని కొనియాడారు. వెన్నెలకంటి ఎంతో కాలం నుంచి తనకు ప్రియమిత్రుడని, తమ నాన్నగారైన స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారి ద్వారా తనకు పరిచయమైన వెన్నెలకంటి నాటి నుంచి తనకెంతో ఆత్మీయునిగా ఉండేవారని ఆయన గుర్తు చేసుకుంటూ.. వెన్నెలకంటి లేని లోటు తీరనిదని అన్నారు. ఈ సందర్భంగా వెన్నెలకంటి కవితా వైశిష్ట్యాన్ని ఆయన కొనియాడారు. వెన్నెలకంటి తన తొలినాళ్ళలో రచించిన 'ఉషోదయం ఆపలేవు' అనే కవితా సంపుటి గురించి ప్రస్తావిస్తూ.. ఇది 'ఆవేదన-ఆవేశం-ఆశ-సంతాపం- సంకల్పం-సంఘర్షణ-నిరీక్షణ'ల ఏడురంగుల్ని తన గుండెల్లో ఇముడ్చుకొని ఏకవర్ణాన్ని పైకి చిమ్ముతోన్న ఇంద్రధనుస్సు' అని డా. నాగభైరవ కోటేశ్వరరావు వెన్నెలకంటిని అభినందిస్తూ రాసిన ముందు మాటను 'లాయర్' ప్రభు శ్రోతలకు చదివి వినిపించారు.

### సాహితీ రంగం మూగబోయింది

చిన్ని నారాయణరావు మాట్లాడుతూ సినీ సాహిత్యంలో అత్యంత అద్భుతమైన గీతాలను రచించిన వెన్నెలకంటి తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచివుంటారన్నారు. వెన్నెలకంటి మరణంతో సాహితీ రంగం మూగబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మురళీకృష్ణ 70 హోటల్స్ నిర్వాహకుడు హజరత్‌బాబు మాట్లాడుతూ తన సమీపబంధువు ద్వారా వెన్నెలకంటి పరిచయమయ్యారని, ఆ తర్వాత బాలు గారు, వెన్నెలకంటితో కలిసి ఎన్నో కార్యక్రమాల్లో తాను పాల్గొన్నానని, వెన్నెలకంటి స్నేహపాత్రుడని తనకెంతో ఆత్మీయుడని గుర్తు చేసుకున్నాడు. ఈ సంతాపసభలో సాహితీవేత్త మెట్టు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ కో-ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, డా. ఎం.సుబ్రహ్మణ్యం, డా. గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, రాచపాళెం రఘు, గూడూరు సుబ్బారెడ్డి, ప్రసాద్‌రావు, ఈతకోట సుబ్బారావు, గోవిందరాజు సుభద్రాదేవి, తోట సులోచన, హెచ్ఎస్‌వికె రంగారావు, ఇసనాక దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని వెన్నెలకంటికి తమతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ నివాళులర్పించారు. 'కళాంజలి' అనంత్ సభా కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, రంగస్థల కళాకారుడు బెనర్జీ వందన సమర్పణ చేశారు.










స్వర్గీయ సోమిరెడ్డి హైమావతమ్మ గారు

W/o. కీ॥శే॥ సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

జననం: 1938 మరణం: 15-01-2014

మాతృదేవోభవ

ఆప్యాయతానురాగాలు పంచిన అమృతమూర్తి
మా ఇంటి ఆరాధ్యదైవం, మా తల్లిగారైన

శ్రీమతి సోమిరెడ్డి హైమావతమ్మ గారు

మమ్ము వీడి దైవసన్నిధికి చేరి ఏడేళ్ళు గడిచిన సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

కన్నీటి నివాళులతో...

కుమారులు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
మాజీ మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

కుమార్తెలు - అల్లుళ్ళు

కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి

కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు | - | మనుమరాండ్రు | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | - | శ్రుతి | యల్లా శర్విన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | - | డా॥ లక్ష్మీ ఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | - | డా॥ సింధు | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | - | నీలిమ | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి | - | షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | - | డా॥ మాలిని | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి | - | కీర్తి | సోమిరెడ్డి రణదేవ్ | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | - | స్నిగ్ధ | | |

# వెన్నెలకంటి.. ఓ చరిత్ర



ఇలాంటి దుర్ఘటన ఒకటి
జరుగుతుందని అనుకోలేదు
ఇంతటి విషాదాన్ని మోయాల్సివస్తుందని
ఊహించనే లేదు
ఎక్కడ పొంచి ఉందో
మృత్యువు ముంచుకొచ్చింది
గళాన్ని వెదుక్కుంటూ
కలం గగనమెక్కింది
మాటల విలుకాడు
పాటల చెలికాడు
'వెన్నెలకంటి' సెలవంటూ..వెళ్లిపోయాడు
నిత్యశోధకుడు..నిర్విరామ పరిశీలకుడు
అధ్యయనమే ఆరోప్రాణంగా సాగిన
'వెన్నెలకంటి' జీవితం
ఇలా అర్థాంతరంగా ముగుస్తుందని
విధి క్రూరంగా కబళిస్తుందని
తలపోయనే లేదు.
పాతపాటల నిఘంటువు
పేజీ మూతపడిపోయింది.
వెన్నెలకంటి గారూ!..
మాటకు రంగు రుచి వాసన
ఉంటాయని మీ మాటల్లో రుజువైంది
మీ మాటల స్ఫూర్తితో
వెలుగుతున్న దీపాలం మేం
మీ అడుగుజాడల్లో నడుస్తున్న
సాహితీకారులం మేం
'చేతన'లో మీ భావోద్వేగాలు
ఏరుకొని 'స్పందన'గా మొలకలెత్తాం
'వేదిక' మీ పరిణతి వీచిక అయితే
ఆ కాంతి జల్లుల్లో
'నాగభైరవ' అవార్డును తీర్చిదిద్దుకున్నాం
ఇంకా...
మీతో నడుస్తున్నట్లే ఉంది
'అతిథి' హోటల్లో చాయ్ తాగినట్లే ఉంది
టౌన్‌హాల్‌లో మీ ఉపన్యాస ఝరిలో
ఈదులాడుతున్నట్లే ఉంది
మీరు లేరంటే మా భవిత పుస్తకానికి
మార్గదర్శనం ఎవరు చేస్తారు?..
నెల్లూరు గీతానికి నుదుట తిలకం
ఎవరు దిద్దుతారు?..
నేస్తమా!...
మళ్ళీ చిగురించిపో!...
మా ఆశల ముంగిట్లో
ప్రాణదీపం వెలిగించి వెళ్ళు!...



- చిన్ని నారాయణరావు
94402 02942

## గూడూరు డివిజన్ వార్తలు

# కనుమూరు హరిచంద్రారెడ్డి ట్రస్టు సేవలు అభినందనీయం

**సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ**



నివర్ తుఫాన్ కారణంగా ఇల్లు కూలిపోవడంతో నిరాశ్రయురాలైన గూడూరు పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న చెందులూరు సుబ్బమ్మకు సి.ఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా డిసెంబర్ 21న కనుమూరు హరిచంద్రారెడ్డి ట్రస్ట్ ద్వారా లక్ష రూపాయల వ్యయంతో ఇల్లు నిర్మించతలపెట్టడం తెలిసిందే! కేవలం మూడు వారాలలో ఆ ఇంటిని పూర్తిచేసి ఈ నెల 12వ తేదీన గూడూరు సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ చేతుల మీదుగా సుబ్బమ్మకు ఇంటి తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ నివర్ తుఫాన్ కారణంగా నిరాశ్రయురాలైన సుబ్బమ్మకు కనుమూరు హరిచంద్రారెడ్డి ట్రస్ట్ ద్వారా, నా చేతుల మీదుగా ఇంటి తాళాలు అందజేయడం సంతోషంగా ఉందని, హరిచంద్రారెడ్డి అభినందనీయుడని అన్నారు. సుబ్బమ్మకు ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సాయమందిస్తామని, ఆమెకు ఎలాంటి సహాయం కావాలన్నా వాలంటీర్‌ను తనకు తెలియజేయమన్నారు. ఇప్పటికే కనుమూరు హరిచంద్రారెడ్డి ఆయన ట్రస్టు ద్వారా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, కోవిడ్ సమయంలో ఆయన సేవలు అపూర్వమన్నారు.

కనుమూరు హరిచంద్రారెడ్డి ట్రస్ట్ వ్యవస్థాపకుడు, వైయస్సార్సీపీ నాయకుడు కనుమూరు హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా సుబ్బమ్మకు ఇల్లు నిర్మించాలని నిర్ణయించామని, 3 వారాలలోనే ఇంటి నిర్మాణం పూర్తి చేసి సబ్‌కలెక్టర్ ద్వారా ఆమెకు తాళం అందజేశామన్నాడు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి జగన్మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారన్నాడు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుతో కలిసి ఫ్లైఓవర్ బ్రిడ్జిని పూర్తి చేయిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపాడు. కార్యక్రమంలో అనిల్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైజేపీ లయన్స్ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి



దాతల సహాయంతో వైజేపీ లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని వైయస్సార్సీపీ సిఇసి సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గూడూరులోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఈ నెల 10న క్లబ్ ద్వారా వృద్ధులకు ఫలసరుకులు, దుప్పట్లను పంపిణీ చేశారు. కాగా, క్లబ్‌కు వై.వెంకటేశ్వరరావు 2లక్షల రూపాయలు, డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి-డాక్టర్ సి.రోహిణి దంపతులు లక్ష రూపాయలు, దశరథరామిరెడ్డి 50వేలు, కె.విజయకుమార్ 10వేలు, శ్రీకంటి రామ్మోహన్‌రావు 5వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లసిరి గోపాలరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రోహిణిలు మాట్లాడుతూ దాతలు అందజేసిన నగదుతో ప్రతిభ వున్న పేద విద్యార్థులకు ప్రోత్సాహాన్నందించాలని కోరారు. క్లబ్ అధ్యక్షుడు నవీన్ జయకుమార్, వరిదిరెడ్డి చంద్రశేఖరరెడ్డి, వై.వేణురెడ్డి, డి.రవీంద్రరెడ్డి, అర్వీరావు, వై.గురునాథం, మంజులమ్మ, శివరాం పాల్గొన్నారు.

## సామాజిక సేవలో
# లయన్స్ క్లబ్ ముందుంటుంది



గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ కోశాధికారి జగదీష్‌చంద్ర కుమార్తె హిమవర్షిణి జన్మదినం సందర్భంగా పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో ఇటీవల పేదలకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మనుబోలు రూపేష్‌రెడ్డి, పూర్వ అధ్యక్షుడు షేక్ రియాజ్‌అహ్మద్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఇదే సందర్భంలో పూర్వ అధ్యక్షులకి ఆత్మీయసత్కారం జరిగింది. క్లబ్ జోన్ ఛైర్మన్ ఏ.వి.సత్యనారాయణ, లయన్ మల్లెమాల మురళీరెడ్డి, ఎస్.వి.ఎల్.ప్రసాద్, వి.రామ్మోహన్, జి.చంద్రశేఖర్, యం.వి.రమణయ్య, క్లబ్ కార్యదర్శి కళ్యాణ్, జె.శ్రీనివాసులురెడ్డి, కె.రజనీకాంత్‌రెడ్డి, కోట రామారావు, ఆర్.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# శ్మశానంలో జంగిల్ క్లియరెన్స్



గూడూరు దక్షిణ శ్మశానవాటికలో ఈ నెల 11వ తేదీ దాతల సహాయంతో సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు, ధర్మరాజులస్వామి దేవస్థానం మాజీఛైర్మన్ గోపాలకృష్ణయాదవ్ జేసీబీతో జంగిల్ క్లియరన్స్ చేశాడు. శ్మశానంలో ముళ్లచెట్లు ఎక్కువగా పెరిగి దారి మూసుకుపోయిందని, పెద్దపండుగ సమయంలో చాలామంది ఎక్కడెక్కడ నుండో తమతమ తల్లిదండ్రుల సమాధుల దగ్గరకొచ్చి నివాళులర్పిస్తారని, అలాంటి వారికి ఇబ్బంది కలుగకుండా ఈ కార్యక్రమం చేయడం జరిగిందని గోపాలకృష్ణయాదవ్ తెలిపాడు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గిరిజనులకు దుప్పట్లు



గూడూరులోని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11న గాదంసెట్టి గిరిబాబు సహకారంతో పారిచెర్ల ఎస్‌టి కాలనీలో 40మంది నిరుపేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి కాటూరు శ్రీనివాసులు, సభ్యులు వాకాటి రామ్మోహన్‌రావు, గ్రానైట్ ప్రభాకర్, శ్రీను, కోఆర్డినేటర్ సతీష్, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# గమళ్ళపాళెంలో అన్నదానం



గూడూరు గమళ్ళపాళెంలో ఉన్న ఓం సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ సూచనతో ఈనెల 9న 40మంది వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. మయూరిశ్యాం కుటుంబసభ్యుడు పునుగు ఆనందరావు పాల్గొని వృద్ధులకు అన్నదానం చేశారు.

## ప్రజల సహకారంతో
# భవ్యమైన రామమందిరం

**- వెంకటాచలంలో రామసేవకుల బైక్ ర్యాలీ**

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామమందిరం నిర్మాణం కోసం సమస్త సమాజం నుంచి సహకారాన్ని కోరుతున్నామని, భవ్యమైన రామమందిర నిర్మాణంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని రామసేవకులు కోరారు. ఈనెల 10న వెంకటాచలం మండలంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో రామాలయ నిర్మాణనిధి అభియాన్‌లో భాగంగా రామసేవకులు పెద్దఎత్తున మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ట్రస్టు మండల కన్వీనర్ గురుప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 31వ తేది వరకు ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించి అందరి సహాయం తీసుకోవడం జరుగుతుందన్నారు. బిజెపి మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులుయాదవ్, ప్రసాద్ రాజు, రాధారెడ్డి, వేణుగోపాలరెడ్డి, పెంచలయ్య, హసనాపురం శ్రీనివాసులు, ప్రసాద్‌యాదవ్, మంద వెంకటేష్ పాల్గొన్నారు.

# వెన్నెలకంటికి నెరసం నివాళి




ప్రముఖ సినీ కవి వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ పాటలు మరువలేనివని, ఆయన మృతి సాహితీ రంగానికి తీరని లోటని నెల్లూరు జిల్లా రచయితల సంఘం (నెరసం) అధ్యక్షుడు ఎ.జయప్రకాష్ అన్నారు. ఇటీవల నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద జరిగిన వెన్నెలకంటి సంతాపసభలో ఆయన పాల్గొన్నారు. దాదాపు రెండున్నరవేల పాటలు రాసి సినీరంగంలోనూ, తెలుగుప్రజల హృదయాల్లోనూ వెన్నెలకంటి సుస్థిరస్థానం సంపాదించుకున్నారని ఆయన కొనియాడారు. గత కొద్దిరోజుల్లోనే గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, వెన్నెలకంటి ఇద్దరూ మృతిచెందడం ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. తొలుత వక్తలందరూ వెన్నెలకంటి మృతికి సంతాపం ప్రకటిస్తూ ఆయన కుటుంబానికి తమ సానుభూతిని తెలిపారు. ఈ సభలో సాహ్నా జిల్లా ప్రధాన కార్యదర్శి జి.హనోక్, డిటి హరికృష్ణ, మాధవరావు, అనూరాధ, బి. నారాయణరెడ్డి, వి. చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# అడ్డగోలుగా నిమ్మగడ్డ

(మొదటి పేజీ తరువాయి)

సాహసం చేసే విధంగా అనేక సంస్కరణలు తీసుకొస్తే... వాటిని అమలుచేయాల్సిన ఎన్నికల కమిషనర్ వాటిని పక్కన పెట్టి కులం కోరల్లో చిక్కుకుని ఎన్నికల కమిషన్ అనే ఒక రాజ్యాంగ వ్యవస్థను అపహాస్యం పాలుచేసి, అభాసు పాలై, కోర్టుల చేత చీవాట్లు తిని అంతటి బలమైన వ్యవస్థను బలహీనమైనదిగా మార్చారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు.

1982 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన నిమ్మగడ్డ రమేష్‌కుమార్ గతంలో తను రాష్ట్ర సర్వీస్‌లో ఐఏఎస్ అధికారిగా ఉన్నప్పుడు పెద్దగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న చరిత్ర లేదు. సృజనాత్మకతతో కూడిన నిర్ణయాలు కనిపించవు. ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించే విషయంలో కానీ, చరిత్ర పుటల్లో లిఖించే అవకాశం ఉన్న నిర్ణయాలు కానీ ఏనాడూ తీసుకున్న దాఖలాలూ లేవు. చాలా సాదాసీదాగా అప్పటి ప్రభుత్వ విధానాలని అమలు చేస్తూ కెరీర్ మొత్తంలో ఎక్కడా అస్సలు వార్తల్లో లేని వ్యక్తి. అలాంటి వ్యక్తి ఇప్పుడు ఎన్నికల కమిషన్ అనే ఒక పవిత్రమైన సంస్థను అపవిత్రం చేస్తూ, బలమైన వ్యవస్థను అత్యంత బలహీన పరుస్తూ, చరమాంకంలో సాగిస్తోన్న వ్యవహారాలపై దేశ వ్యాప్తంగా పెద్ద చర్చే జరుగుతోంది.

రాష్ట్రంలో ఇప్పుడు నిర్వహించ తలపెట్టిన స్థానిక సంస్థల ఎన్నికలు 2018 ఆగస్టులో జరగాలి. అంతకుముందు 2013 ఆగస్టులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చిట్టచివరి ముఖ్యమంత్రి అయిన కిరణ్ కుమార్‌రెడ్డి సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి, వాటి పదవీకాలం 2018 ఆగస్ట్‌కి ముగిసింది. అప్పుడు మూడు నెలలలోపు ఎన్నికలు నిర్వహించాలని కోర్టు కూడా ఆదేశించింది. అయితే అప్పుడు కూడా ఇదే పదవిలో జీవచ్ఛవంలా ఉన్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్ కోర్ట్ ఆదేశాలను కూడా పట్టించుకోకుండా ఎన్నికలు జరపకపోవడానికి కారణం అందరికీ తెలిసినా మరొక్కసారి చర్చించుకోవాల్సిన అవసరం ఉంది. కుల స్వామ్యం, అంతులేని అవినీతి, అక్రమాలు, దందాలు, కాల్ మనీలు, సెక్స్ రాకెట్‌లు, రాజధాని పేరుతో లూటీలు, అన్ని వర్గాలపై అగ్రకుల ఆధిపత్య అహంకార జాడ్యంతో అప్పటికే అవసాన దశకు చేరుకున్న టీడీపీ ప్రభుత్వం, అప్పుడే కనుక ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్ళుంటే దారుణంగా ప్రజాగ్రహానికి గురి కావాల్సి వస్తుందని, ఆ ఎన్నికలను తాత్కాలికంగా అప్పుడు ఆపి 2019లో జరిగే సార్వత్రిక ఎన్నికలలో పసుపు కుంకుమ, ఆకు వక్క అంటూ ప్రజలను మోసగించి మళ్లీ అధికారంలోకి రావచ్చన్న చంద్రబాబు ఆలోచనలకు మడుగులు ఒత్తి అప్పట్లో ఎన్నికలు నిర్వహించే సాహసం చేయని ఈ రమేష్‌కుమార్ ఇప్పుడు ఎన్నికలు వెంటనే నిర్వహించకపోతే తన గుండె ఆగిపోద్దేమో అన్నంత ఆవేదన వ్యక్తం చేయడం వెనక కుల పరిరక్షణ తప్ప వేరే కారణమే కనిపించదన్నది విశ్లేషకుల వాదన.

సాధారణంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్లు స్వతంత్రంగా వ్యవహరించినా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేసుకుంటూ నిర్ణయాలు తీసుకుంటుంటాయి. ఎన్నికల నిర్వహణ అంటే ఎన్నికల కమిషన్లకు ప్రత్యేక సిబ్బంది ఏమీ ఉండరు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే ఈ ప్రక్రియ నిర్వహించాలి, ఎస్ఈసీకి జీతభత్యాల దగ్గరనుంచి ఎన్నికల ఖర్చు వరకు రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సమయాన్ని నిర్ణయించడంలో కానీ, ఒకవేళ అసాధారణ పరిస్థితుల్లో వాటిని మధ్యలో ఆపాలన్నా రాష్ట్ర ప్రభుత్వాన్ని కచ్చితంగా సంప్రదించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆ ప్రక్రియలో పాల్గొనాల్సింది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వాటి నిర్వహణకు లాజిస్టిక్స్ ఏర్పాటు చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే కాబట్టి వాటి అనుకూల, అననుకూలతలపై ప్రభుత్వాన్ని సంప్రదించకపోతే సమన్వయం అసాధ్యం కాబట్టి ఇది తప్పనిసరి. ఇక్కడే అసలు లాజిక్ మిస్సయ్యారు నిమ్మగడ్డ. ఆ మాట అనడం కన్నా కులం మాటున దిగజారుడు ఆలోచన చేశారు మన ఎస్ఈసీ అన్న విమర్శలు ఉన్నాయి. ఇవి కేవలం విమర్శలు మాత్రమే కాదు, సుప్రీంకోర్ట్ కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా ఎన్నిక వాయిదా వేయడం సరికాదని, భవిష్యత్‌లో ఏ నిర్ణయం తీసుకున్నా ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించాల్సిందే అని గుర్తుండేలా చెంపదెబ్బ వేసి చెప్పినా వాటిల్ని అమలు పరిచేందుకు నిమ్మగడ్డకు కుల ప్రయోజనాలు అడ్డొచ్చాయ్.

రాజ్యాంగ, దేశ, రాష్ట్ర, సమాజ, ప్రజా ప్రయోజనాలకంటే కుల ప్రయోజనాలే మిన్నగా భావించే ఈ కుల భక్తుడు మళ్లీ ప్రభుత్వాన్ని సంప్రదించకుండా, ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని ఒకవైపు ప్రభుత్వం చెబుతున్నా వినకుండా ఈనెల 8న పంచాయతీ పోరుకు నోటిఫికేషన్ ఇచ్చాడు. ఇక్కడ మరోసారి కోర్టుల నుంచి మొట్టికాయలు తప్పవని తెలిసినా ఈ బరితెగింపు వెనక కారణాలు ఏంటి అన్నది ప్రత్యేకించి చెప్పక్కర్లేదు... అందులోనూ ప్రపంచాన్నీ, మానవ జాతి మనుగడను ప్రశ్నార్థకం చేసిన కరోనా వైరస్ మహమ్మారి శాశ్వత నిర్మూలన కోసం జరుగుతోన్న వాక్సినేషన్ ప్రక్రియ ప్రధానమని కోర్టులు చెప్పినా వినకుండా అప్పీల్‌కి వెళ్లడమంటే అది నిర్లక్ష్యం కాక ఇంకేంటి?

కానీ ఇక్కడ వాళ్ళ అధర్మ వేదం చెల్లుబాటు అవడానికి గతంలా అ"న్యాయ" మైన పరిస్థితులు లేవు. ఇష్టం వచ్చినట్టు డాన్సులు వేయడానికి రాకేష్ మాస్టర్లు లేరు... రాకేష్ మాస్టర్లకు అడ్డగోలు కూచిపూడి కుల నృత్యాలు నేర్పిన గురువుల ముడ్డి కిందకు నీళ్లు రావడంతో ఆ తడి తుడుచుకునే ప్రయత్నంలో వాళ్ళు బిజీగా ఉన్నారు. ఈ వాస్తవాలు అన్నీ తెలిసినా కుల పార్టీని కాపాడుకోవడానికి వేరే దారి కనపడకపోవడంతో ఇక దేనికైనా రెడీ అంటూ ఈ దిగజారుడు వ్యవహారాలకు సిద్ధమైపోయారు ఎల్లో బ్యాచ్.

అనుకున్నట్టుగానే రాకేష్ మాస్టర్ లేకపోవడం, సిక్కిం లాంటి పరిస్థితులు రాష్ట్రంలో లేకపోవడంతో ఈ నెల 11న దీనిపై గౌరవ హైకోర్టు ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపడుతూ తాజాగా ఇచ్చిన నోటిఫికేషన్‌ని రద్దు చేసింది. అక్కడకు ఆగి ఉంటే ఎన్నికల కమిషన్ ఇంత బలహీనమై ఉండేది కాదు. మళ్లీ డివిజన్ బెంచ్‌కి అప్పీల్... అక్కడ కూడా ఇందులో అత్యవసరంగా చర్చించాల్సిన అవసరం ఏమీ లేదులే కానీ నిదానంగా కనపడు అంటూ కోర్ట్ అక్షింతలు వేయడంతో, అందరి జీవితాల్లో వెలుగులు పరిచిన ఈ భోగి ఎల్లో బ్యాచ్ జీవితాల్లో మాత్రం చీకట్లు నింపింది.

దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 50శాతం ఓట్లు, 86 శాతం సీట్లు సాధించి, ఆర్థికంగా ఆశాజనకంగా లేని పరిస్థితుల్లో కూడా తాము ఇచ్చిన హామీలను, అసాధారణ రీతిలో సంక్షేమాన్ని అమలుచేస్తోన్న ఈ ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలకు వెళ్లినా చారిత్రక విజయాలే దక్కుతాయి, ఈ విషయం అర్థం చేసుకోవడానికి రాజకీయ చాణుక్యం కాదు కదా అసలు రాజకీయ పరిజ్ఞానమే అక్కర్లేదు.

రాజకీయంగా ఎదుర్కోవడం ఇక సాధ్యమయ్యే పనే కాదనే కదా విగ్రహాల ధ్వంసాలకు, మత రాజకీయాలకు పాల్పడుతోంది అన్న చర్చల మధ్యలో నిమ్మగడ్డ లాంటి వారి పాత్ర ఎన్నికల కమిషన్‌ని ఎంత దిగజార్చిందో, ఎంత బలహీనపరించిందోనన్న మాట ఇప్పుడు సర్వత్రా వినిపిస్తోంది.

## ఎర్రచందనం పట్టివేత

మర్రిపాడు మండలం, వెంకటాపురం అడవుల్లో గొర్రుట్ల దగ్గర దుండగులెవరో అక్రమంగా దాచిపెట్టి ఉన్న 18 ఎర్ర చందనం దుంగలను ఇటీవల అటవీ అధికారులు కనుక్కుని బయటకుతీశారు. వీటి ఖరీదు 2,5 లక్షల రూపాయల దాకా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు అటవీ అధికారవర్గాలు పేర్కొన్నాయి. వెంకటాపురం అడవుల్లో ఎర్రచందనం దొంగలను వెతికి పట్టుకునేందుకు అటవీ సిబ్బందితో కలిసి కూంబింగ్ చేస్తుండగా గొర్రుట్ల వద్ద ఎర్రచందనం దుంగలను అక్రమార్కులు పూడ్చిపెట్టి ఉండడాన్ని గమనించి వాటిని ఆత్మకూరు అటవీ కార్యాలయానికి తరలించామని తెలిపాయి.

## నేత్రపర్వంగా ఊళ్ళమ్మ జాతర

నెల్లూరు నగర శివార్లలో ఉన్న కోడూరుపాడు గ్రామదేవత ఊళ్ళమ్మ అమ్మవారి జాతర ఈనెల 10న వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శివాలయం నుంచి పసుపు కుంకుమలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకునివచ్చి అమ్మవారికి సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఈ జాతరకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, లేబూరు పరమేశ్వర్‌రెడ్డి తదితరులు జాతర ఏర్పాట్లను పరిశీలించారు.

## కోటమ్మతల్లికి ప్రత్యేక పూజలు

మండల కేంద్రమైన కోట గ్రామదేవత కోటమ్మతల్లికి ఈనెల 10న ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి అమ్మవారికి విశిష్ట సేవలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్ళు పొంగించి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# ఆపద్బాంధవుడు.. నల్లగొండ్ల శ్రీ లక్ష్మీ నృసింహుడు

**భక్తులు కోరిన కోరికలు తీర్చే భక్తవరదుడుగా, ఆపదల నుంచి కాపాడే ఆపద్బాంధవుడుగా నల్లగొండ్ల శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ప్రసిద్ధి. రాపూరు మండలంలోని పెంచలకోనలో ఉన్న శ్రీ లక్ష్మీనృసింహాలయం, నెల్లూరు సమీపంలోని వేదగిరి శ్రీలక్ష్మీనృసింహాలయంతో పాటు వింజమూరు మండలంలోని నల్లగొండ్ల గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహాలయం కూడా అనాదిగా అశేష భక్తజనుల విశేష పూజలందుకుంటూనే ఉంది. నిత్యం వందలాది మంది భక్తులతో కళకళలాడే ఈ ప్రాచీనమైన ఈ ఆలయం ఆవిర్భావానికి ఆసక్తికరమైన పురాణ ప్రశస్తి కూడా ఉంది.**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలో ఎంతో ప్రాచీనకాలం నుంచి ఉన్న పలు నారసింహక్షేత్రాలు జిల్లా ఆధ్యాత్మిక వైభవాన్ని చెప్పకనే చెప్తుంటాయి. పెంచలకోన, నరసింహకొండల్లో వలెనే నల్లగొండ్లలో కూడా శ్రీ లక్ష్మీనరసింహాలయం ఎంతో మహిమాన్వితమైన ఆలయంగా ప్రతీతి. పిలిచిన పలికే దేవుడుగా లక్ష్మీ నృసింహుడు భక్తులందరినీ అనుగ్రహిస్తుంటాడు. కనువిందుగా కనిపించే పచ్చని చెట్ల మధ్య, రమణీయమైన ప్రకృతి సోయగాల మధ్య అలరారుతూ ఉన్న ఈ ఆలయంలో శ్రీ నరసింహస్వామివారు శ్రీమహాలక్ష్మీదేవి– శ్రీ చెంచులక్ష్మీదేవి సమేతుడై కొలువై ఉన్నారు. నల్లటి కొండల మీద స్వయంభువుగా వెలసిన స్వామివారి ఆలయం ఎంతో పురాతన కాలం నుంచి భక్తుల పూజలందుకుంటోంది.

పురాణ కథనం ప్రకారం..హిరణ్యకశపుని సంహరించడానికి మహావిష్ణువు నరసింహరూపం ధరించాడు. ఆ రాక్షసుని సంహారం అనంతరం ఉగ్రరూపంతో ఉన్న స్వామివారిని శాంత పరచేందుకు భక్తప్రహ్లాదుడు, మహామునులందరూ కలసి నారాయణ మంత్రజపంతో ప్రార్థించగా స్వామివారు శాంతించి స్వయంభువుగా శిలారూపంలో వెలసి భక్తులందరినీ అనుగ్రహిస్తున్నారు. ఆ తర్వాత జనమేజయుని కాలంలో ఇక్కడ ఆలయం నిర్మితమైందని అంటారు. నల్లగొండ్లలోని నల్లటి కొండల మీద ఎంతో అద్వితీయమైన రీతిలో ఈ ఆలయం వెలసి ఉంది. కొండమీద అత్యద్భుతమైన శిల్పచాతుర్యంతో ఆలయ స్వాగత ద్వారాలు నిర్మించారు. ఈ ద్వారాలపై నారదుడు, తుంబురుడులతో పాటు మండపం పైభాగంలో శ్రీ మహావిష్ణువు, కాళీయమర్దనం దృశ్యాలతో పాటు, స్వాగత ద్వారాలకు ఇరువైపులా నల్లరాతితో రూపొందించిన జయవిజయుల విగ్రహాలు దర్శనమిస్తాయి. ఆలయాన్ని చూడగానే భక్తిభావంతో పరవశించేలా సుప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణం ఉంటుంది. చుట్టూ చక్కని ప్రకృతి సోయగాలు ప్రతిఒక్కరినీ ఎంతో బాగా ఆకట్టుకుంటూ ఉంటాయి. గర్భాలయంలో నేత్రపర్వంగా కొలువై ఉన్న శ్రీమహాలక్ష్మీదేవి, శ్రీ చెంచులక్ష్మీదేవి అమ్మవార్లను, దేవదేవుడైన శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారిని భక్తితో దర్శించుకుని ప్రార్థిస్తే ఎలాంటి కష్టాలైనా సమసిపోతాయి. ఈ ఆలయం చెంతనే







## మన దేవాలయాలు (29)

శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం ఉంది. ఏకశిలా రూపంలో నయనానందకరంగా దర్శనమిచ్చే శ్రీ ఆంజనేయ స్వామివారే ఈ ఆలయానికి క్షేత్రపాలకుడుగా ఉంటూ ఆల యాన్ని అనుక్షణం పరిరక్షిస్తూ ఉంటాడని స్థలపురాణం చెప్తోంది. ప్రతి ఏటా ఏడాదికోసారి వైశాఖ శుద్ధ ద్వాదశి రోజు నుంచి బహుళ పంచమి దాకా తొమ్మిదిరోజుల పాటు ఇక్కడ అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఎంతో వేడుకగా జరిగే స్వామివార్ల ఎదురుకోలు ఉత్సవం, కల్యాణోత్సవాలను భక్తులు ఎంతో ఆనందంతో తిలకించి పరవశించిపోతుంటారు.

### అత్యద్భుతమైన గుహ మల్లేశ్వరాలయం

కొండ కింద ఈశాన్య భాగంలో ఒక అత్యద్భుతమైన గుహ ఉంది. ఆ గుహలో ఎంతో పురాతన కాలం నుంచి వెలసి ఉన్న శ్రీ మల్లేశ్వరాలయం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటూ ఉంటుంది. గుహలో వెలసిన ఆలయం కనుక ఈ ఆలయానికి గుహ మల్లేశ్వరాలయంగా పేరు వచ్చింది. అంతే కాదు, అటు శ్రీమహావిష్ణు అవతారరూపమైన నారసింహుడు, ఇటు మల్లేశ్వరుడు నెలవై ఉన్న ఈ ఆలయాలతో ఈ క్షేత్రం శివకేశవుల అభేదానికి ప్రతీకగా పెద్దలు చెప్తుంటారు. గుహ లోపలకి ఇరుకైన దారులున్నాయి. కొంచెం కష్టమైనా భక్తులు ఈ ఇరుకుదారుల్లో వచ్చి శ్రీ మల్లేశ్వరస్వామి కరుణా కటాక్ష వీక్షణాలకు పాత్రులవుతుంటారు. శ్రీ మల్లేశ్వరుని సన్నిధితో పాటు శ్రీ త్రయాంబికాదేవి అమ్మవారిని, శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని, శ్రీ లలితాదేవి అమ్మవార్లను కూడా భక్తులు ముకుళిత హస్తాలతో దర్శించుకుని తరిస్తుంటారు.

# నెల్లూరులో 'జగన్'

## 'అమ్మ ఒడి' రెండో విడత సాయం పంపిణీ





**ప్రజలందరూ బాగుండాలని మనసారా కోరుకుంటూ.. 'అమ్మఒడి' పథకం వెలుగులను అందరికీ పంచడానికి వచ్చిన తమ అభిమాన నేత, రాజన్న బిడ్డ వైయస్ జగన్మోహన్‌రెడ్డిని చూసి సింహపురి ఉప్పొంగిపోయింది. ప్రజలు, అభిమానులు 'జై జగనన్నా' అంటూ వేలాదిగా వచ్చి తమ ఆత్మీయతాభిమానాలను చాటుకున్నారు. ఎంతో హుందాగా.. రాజఠీవితో వచ్చిన జగనన్నను చూసి నెల్లూరు ప్రజలు అడుగడుగునా ఆనందంతో ఉప్పొంగిపోయారు.**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అమ్మ ఒడి' పథకం రెండో విడత సాయంగా రాష్ట్రవ్యాప్తంగా 84 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా 44.48 లక్షల మంది తల్లుల ఖాతాల్లోకి 6673 కోట్ల రూపాయల నగదును బటన్ నొక్కి జమచేసే బృహత్తర పథకానికి ముఖ్యమంత్రి జగన్ ఈనెల 11న నెల్లూరులో శ్రీకారం చుట్టడం పట్ల నెల్లూరు ప్రజల్లో ఆనందం వెల్లువెత్తింది. ఒక్కసారిగా పెద్దఎత్తున నగర ప్రజలు నెల్లూరులోని ఎస్‌విజిఎస్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన సభాస్థలం వద్దకు తరలివచ్చారు. అడుగడుగునా సిఎంకు నాయకులు, ప్రజలంతా ఘనస్వాగతం పలికారు. సిఎంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి వెంట రాగా, నీటిపారుదల మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి, విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, నాయకులు, ప్రముఖులతో పాటు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, గుంటూరు రేంజ్ డిఐజి త్రివిక్రమవర్మ, జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ తదితరులంతా ముఖ్యమంత్రి జగన్‌కు ఘనంగా స్వాగతం పలికారు. జగన్‌ను చూసేందుకు జనం తండోపతండాలుగా తరలిరావడంతో సభాప్రాంగణం క్రిక్కిరిసిపోయింది. పుట్టిన ప్రతిబిడ్డకు అమ్మఒడి లాగానే చదువుకునే బిడ్డల భవిష్యత్తుకు ఎంతో ఆసరాగా నిలిచే 'అమ్మ ఒడి పథకం' రాజన్న బిడ్డ ద్వారా వచ్చిందనే ఆనందం తల్లిదండ్రులందరిలో కనిపించింది. అందుకు తగ్గట్టుగా చదువుకుంటున్న ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు గుండెనిండుగా భరోసా కలిగేవిధంగా ఈ అపురూపమైన 'అమ్మ ఒడి' పథకానికి సంబంధించిన రెండో విడత సాయం ముఖ్యమంత్రి చేతులమీదుగా నెల్లూరులో ప్రారంభం కావడం పట్ల నెల్లూరు ప్రజలు మరింతగా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### పేదింటి బిడ్డలకు అమ్మఒడి.. శ్రీరామరక్ష

రాష్ట్రంలో చదువుల విప్లవాన్ని తెచ్చి కేవలం 19నెలల్లోనే విద్యారంగంపై దాదాపు 24వేల కోట్లు ఖర్చు చేశామని, పిల్లలంతా తప్పనిసరిగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ముఖ్యమంత్రి జగన్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. గతంలో పాలకులు పిల్లలకు ఓటుహక్కు లేదని విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారని, అయితే పిల్లలకు ఓటుహక్కు లేకపోయినా ఒక మేనమామగా వారి మంచి చెడులను చూడడం తన బాధ్యతని సిఎం చెప్పడంతో ప్రజలు పెద్దఎత్తున కరతాళధ్వనులు చేశారు. అమ్మఒడి ద్వారా ఈ ఏడాది మరో రెండు లక్షల మంది తల్లులకు ప్రయోజనం చేకూరిందని, ప్రభుత్వ బడుల్లో చదువుల అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, దీంతో ప్రభుత్వ బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య దాదాపు 4లక్షల దాకా పెరిగిందని సిఎం ఈ సభలో చెప్పారు. అంతేకాదు పాఠశాలల అభివృద్ధికి 'నాడు-నేడు' పథకం కింద దాదాపు 2600 కోట్లు ఖర్చుచేశామన్నారు. తల్లులు కోరుకుంటే వచ్చే ఏడాది నుంచి అమ్మఒడి పథకం కింద డబ్బులికి బదులుగా ల్యాప్‌టాప్‌లు ఇస్తామని, 9 నుంచి 12 తరగతుల విద్యార్థులకు దీనిని వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.









'అన్నా... వెళ్లొస్తా...' అంటూ ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి వీడ్కోలు చెబుతున్న సిఎం జగన్

### గుడులతో పాటు బడులు కూడా జాగ్రత్త

రాష్ట్రంలో ఇంతపెద్దఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలవుతుంటే ప్రతిపక్షాలకు మాత్రం కడుపుమంటగా ఉంటోందని సిఎం జగన్ విమర్శించారు. కేవలం కడుపుమంటతోనే లేనిపోని అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. రాత్రిళ్ళు ఎవరూ లేనిచోట విగ్రహాలను ఎవరు ధ్వంసం చేస్తున్నారో ఒక్కసారి ఆలోచించండి అని ఆయన ప్రజలనుద్దేశించి అన్నారు. ధ్వంసమైన విగ్రహాలను పరిశీలిస్తామంటూ మళ్ళీ అక్కడకు వాళ్లు ఎందుకు వెళ్తున్నారో అర్థం చేసుకోండి. రథాలు ఎందుకు తగలబెడుతున్నారో.. ఆ తర్వాత రథయాత్రలు ఎందుకు చేయబోతున్నారో ఆలోచించండి. మనం ప్రజలకు మంచి చేసే ఏ కార్యక్రమం చేపట్టినా సరిగ్గా ఒకటిరెండు రోజులు ముందుగా చీకట్లో వెళ్ళి గుడులను గోపురాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. వీరంతా రేపు బడుల మీద కూడా పడతారేమో జాగ్రత్తగా ఉండాలన్నారు. మన కుటుంబాలు ఎదుగుతుంటే సమాజంలో మంట పెట్టడానికి వస్తున్నవాళ్ళకి బుద్ధి చెప్పాలని సిఎం జగన్ ప్రజలను కోరారు.



### సిఎం సభ.. సూపర్ సక్సెస్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన దిగ్విజయమైంది.. ఈనెల 11న 'అమ్మ ఒడి' పథకం రెండో విడత కార్యక్రమాన్ని సిఎం జగన్ నెల్లూరులో ప్రారంభించి నెల్లూరీయులందరి అభిమానానికి మరింతగా పాత్రులయ్యారు. వాస్తవానికి ఈనెల 9నే సిఎం పర్యటన ఉండాల్సి ఉన్నా, ఆరోజు రెండవ శనివారం కాబట్టి బ్యాంకులకు సెలవు కావడం, అమ్మ ఒడి పథకానికి సంబంధించిన నగదు జమ, చెల్లింపులకు ఇబ్బంది ఏర్పడవచ్చనే ఆలోచనతో సిఎం పర్యటన 11వ తేదికి వాయిదా పడినట్లు సమాచారం. దీంతోపాటు, 9వ తేదినే స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్న అభిప్రాయాలతో సిఎం నెల్లూరు పర్యటన విషయంలో కొంత సందేహాలు వచ్చినా ఆ తర్వాత ఎట్టకేలకు సిఎం పర్యటన ఖరారు కావడంతో నెల్లూరు నాయకుల్లో ఆనందం పెల్లుబికింది. సిఎం నెల్లూరు నగర పర్యటన విజయవంతం కావడానికి మంత్రులు అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతంరెడ్డి, ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులతో పాటు ఎందరో ప్రముఖ నాయకులు, ఎమ్మెల్యేలు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు అంతా కలసికట్టుగా కృషిచేయడం, సిఎం సభకు భారీగా జనం తరలిరావడంతో సభ సూపర్‌సక్సెస్ అయింది. జిల్లా ఎస్పీ భాస్కరభూషణ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీఎత్తున బందోబస్తు నిర్వహించి ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సిఎం పర్యటన సాఫీగా జరిగిపోవడంతో జిల్లా అధికారయంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

# ఊరికి మంచిపేరు తెస్తున్నారు

## విద్యార్థులను అభినందించిన వైయస్సార్సీపి నేత

నాయుడుపేట మండలంలోని మేనకూరు గ్రామానికి చెందిన అయిదుగురు విద్యార్థులు ఇటీవల మెడిసిన్‌లో ఫ్రీ సీటు సాధించడం విశేషమని, బాగా చదుకుంటూ విద్యార్థులు తాము పుట్టినూరుకి మంచిపేరు తెస్తున్నారని వైయస్సార్సీపి ట్రేడ్‌యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి ఆ విద్యార్థులను అభినందించి సన్మానించారు. ఇటీవల మేనకూరులో జరిగిన విద్యార్థులకు అభినందన సభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ట్రిబుల్ ఐటిలో కూడా ఉత్తమస్థాయిలో రాణిస్తున్న మరో ఇద్దరు విద్యార్థులను అభినందించారు. విద్యారంగంలో మేనకూరు విద్యార్థులు ప్రతిభతో రాణిస్తుండడం తమకెంతో ఆనందం కలిగిస్తోందని, విద్యార్థుల చదువులకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. మెడిసిన్‌లో సీట్లు సాధించిన నాసిన గౌతం, నాసిన జయకృష్ణ, నాసిన శివహరి, పల్లమాల సౌజన్య, పుట్టమనేని హర్షితతో పాటు ట్రిబుల్ ఐటిలో సీట్లు సాధించిన ఎల్.మురళి, పల్లమాల సుప్రియలను ఆయన సన్మానించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### యువతకు ఉచితంగా

# 35 రోజుల పాటు నైపుణ్య శిక్షణ

జిల్లాలోని నిరుద్యోగ యువతకు బెంగుళూరులోని యూనిటీ శిక్షణ కేంద్రం ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కూడా కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం ఈనెల 12న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువతకు ఉచిత భోజన వసతి సదుపాయాలతో 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, హైజనిక్, లైఫ్ స్కిల్స్, రీటైల్, ట్యాలీ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి నుంచి పీజీ వరకు చదివి 18 నుంచి 25 ఏళ్ళ వయసు కలవారై ఉండాలన్నారు. వివరాలకు ఫోన్ 99634 25999 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

# సోమశిల డ్యామ్ భద్రంగానే ఉంది

## - పరిశీలించి చెప్పిన నిపుణులు



నివర్ తుఫాన్ సమయంలో వరద నీళ్ళు పెద్ద ప్రవాహంలా రావడంతో సోమశిల డ్యామ్ పరిస్థితి ఏమైపోతుందో నని ఆందోళన జిల్లావాసుల్లో కలిగింది. నిండా నీటితో ఉన్న డ్యామ్‌కు అదనంగా భారీ ప్రవాహం రావడం వల్ల డ్యామ్‌కు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం కలుగు తుందోనని ప్రజలు భయాందోళనలతో గడిపారు. అయితే, సోమశిల జలాశయం కట్టడాలు అక్కడక్కడా దెబ్బతిన్నప్పటికీ, జలాశయం పటిష్టతకు ఎలాంటి ఢోకా లేదని ఈనెల 10న నిపుణుల బృందం తేల్చిచెప్పడంతో జనం ఊపిరి పీల్చు కున్నారు. విశ్రాంత చీఫ్ ఇంజనీర్లు ఆర్.సత్యనారాయణ, కె.వి సుబ్బారావు, ఎంఎన్ రాజు, బిఎస్ఎన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డిలతో పాటు సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ కె.శ్రీనివాస్, తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ హరినారా యణరెడ్డి, ఎస్ఇ సూరిబాబు తదితరు లంతా కలిసి డ్యామ్‌ను పరిశీలించారు.

నివర్ తుఫాన్ రోజుల్లో పైతట్టు ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు వచ్చింది. ప్రవాహ ఉధృతిని తగ్గించేందుకు అధికారులు ఎప్పటికప్పుడు నీటిని దిగు వకు విడుదల చేశారు. దాదాపు 3.72 లక్షల క్యూసెక్కుల నీటిని డ్యామ్ నుంచి దిగువకు వదిలేయడం తప్పనిసరైంది. దీంతో, నిండా నీటి నిల్వ ఉన్న డ్యామ్ నుంచి వరదనీటిని వదిలేయడం వల్ల డ్యామ్ కట్టడాలు అక్కడక్కడా దెబ్బతిన్నట్లు నిపుణులు గుర్తించారు. అయితే డ్యామ్ పటిష్టతకు ఇబ్బంది లేదన్నారు. డ్యామ్‌లోని ఆఫ్రాన్, ఫ్లడ్‌బ్యాంక్, డౌన్‌స్ట్రీమ్, పవర్ టన్నెల్‌తో పాటు కోతకు గురైన పొర్లుకట్ట లను వారు పరిశీలించి తుఫాన్‌లు, భారీ వరదల సమయంలో ఇలాంటి నష్టాలు సహజమేనని, ఎవరూ ఆందోళన చెందా ల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రాజెక్టు ప్రధాన కట్టడానికి ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. దెబ్బతిన్న కట్టడాలకు మరమ్మ తులు అవసరమని, వాటి పనులు పటి ష్టంగా చేసేందుకు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపుతామన్నారు. భవిష్యత్తులో భారీ వరద వచ్చినా ఇబ్బంది లేకుండా వరద ప్రవాహం ఎప్పటికప్పుడు పెన్నా నదిలోకి సాఫీగా వెళ్ళిపోయేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

### అల్లూరు నగర పంచాయతీలో..

# ఇక పూర్తిస్థాయి అభివృద్ధి

అల్లూరు నగర పంచాయతీలో ఇక పూర్తిస్థాయి అభివృద్ధి జరుగుతుందని, ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని కావలి మునిసిపల్ కమిషనర్ ఎన్.శివారెడ్డి స్పష్టం చేశారు. ఇటీవలే కొత్తగా ప్రకటించిన అల్లూరు నగర పంచాయతీకి ఇన్‌చార్జి కమిషనర్‌గా ఆయన నియమితులై ఈనెల 8న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అల్లూరును నగర పంచాయతీని చేస్తూ ఆర్డినెన్స్ విడుదలైందని, దీంతో ఈ ప్రాంతమంతా బాగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. దీనికి వచ్చే నిధులు, విధులు అన్నీ మునిసిపాలిటీ జాబితా కిందనే విడుదలవుతాయన్నారు. ఈ ప్రాంతం మునిసిపాలిటీ అయితే నష్టపోతామని కొంతమంది ప్రజలు అపోహపడుతున్నట్లు తెలుస్తోందని, అలాంటి అపోహలను నమ్మ వద్దని ఆయన అంటూ అల్లూరును బాగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యనిర్వహణాధికారి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 'వారెవా!'.. అనిపించే సంగెవేని కవితలు

గ్రంథ సమీక్ష




రచన : సంగెవేని రవీంద్ర
వెల : రూ.100/- పేజీలు : 54
ప్రతులకు:
సి.వి.కాంపౌండ్ 7/4,
హనుమాన్ లేన్, లోయర్ పారెల్,
ముంబై-13. సెల్: 9987145310

బతుకుతెరువు వెతుక్కుంటూ ముంబయి చేరిన వలసజీవి సంగెవేని రవీంద్ర. అయితేనేం తెలుగు భాష, సాహిత్యాల పట్ల అభిరుచి, ఆసక్తి వున్న వ్యక్తి. అదే ఆయన్ను రచయితగా మార్చింది. అనూహ్యంగా తెలుగు సాహిత్య ప్రపంచం ఆయన్ను గుండెల్లోకి చేర్చుకుంది. అంతులేని ఆత్మీయతను పంచింది. తెలుగు సాహితీవేత్తలతో సాన్నిహిత్యాన్ని కల్పించింది. ప్రాంతాల కతీతంగా వందలాది సాహితీ మిత్రుల్ని సంపాదించిపెట్టింది.

ఆ ఉత్సాహం, ప్రోత్సాహంతోనే ఇదివరకు పద్నాలుగు పుస్తకాలను ప్రచురించారు. ఇది పదిహేనవ పుస్తకం. ఆయన రాసిన పుస్తకాలు ఎక్కువ భాగం కవిత్వానికి సంబంధించినవి. కవిత్వం ఎంత బాగా రాయగలరో కథలూ అంత బాగా రాయగలరు సంగెవేని. అందుకే ఆయన అందుకున్న అవార్డులు, రివార్డులు లెక్కకు మించినవి. సంగెవేని కేవలం కవి, రచయితే కాదు మంచి సంపాదకుడు కూడా. మీదు మిక్కిలి సంఘసేవకుడూనూ.

ఇప్పుడు తాజాగా వచ్చిన మినీకవితల సంకలనం 'వారెవా'. పేరే 'వారెవా!' అన్పించేటట్టుంది. అందులోని కవితలూ అంతే! 'వాక్యం రసాత్మకం కావ్యం' అన్నట్లు ప్రతి మినీ కవితా అర్థవంతంగా ఉంది. ఆలోచనలు రేకెత్తించేదిగా ఉంది. నేటి జీవన సరళిని, మానవ మనస్తత్వాలను తేటతెల్లం చేసేటట్టూ వుంది.


ఒక మినీ కవితలో సంగెవేని ఇలా అన్నారు. "నా అక్షరం ఆయుధం కానక్కర లేదు... అలారమైతే చాలు..! నిద్ర లేచినోడు, యుద్ధం చేయకుండా ఉంటాడా...?" అని – ఎంత గొప్ప మాట... నా అక్షరాలే ఆయుధాలు అన్న కవులను చాలామందిని చూశాం. కానీ ఈ కవి అక్షరాలు అలారం అయితే చాలు అంటాడు. నిద్ర లేచినవాడు సమస్యలతో యుద్ధం చేయకుండా వుండడు అని కవి భావన.

"ఏది జరిగినా, ఏది చూసినా, మనకెందుకులే అని మొహం తిప్పుకొని పోవడం సుప్తావస్థ. అక్షరాల అలారంతో జాగ్రదవస్థలోకి వచ్చి, సమస్యల్ని ఎదుర్కోవడం కవి ఊహిస్తున్న విషయం.

కవిలో మంచి తాత్త్వికత ఉంది. సామాజిక స్పృహ ఉంది. అందుకు తార్కాణం ఈ కవిత. 'పోయాక మోసేం దుకే కాదు... మన గురించి రాసేందుకు కూడా నలుగురు కావాలి...ఏమైనా ఇస్తే ఎవరైనా మోస్తారు... ఏమైనా చేస్తేనే మన గురించి రాస్తారు...!' ఎంతమంచి మాట. జీవితాన్ని ధన్యం చేసుకునే మార్గం కవి ఈ కవితలో చెప్పారు. మోయడం, రాయడం అనే పదాలు ఈ మినీకవితకు అందం, అర్థం తెచ్చాయి.

సంగెవేని కవిత్వం ఎందరినో ఊర డిస్తుంది. ఎందరినో ఆలోచింపజేస్తుంది. ఎందరికో కర్తవ్యబోధ చేస్తుంది. అంతేగాదు, రాసే కవికి కష్టాల్లో వెన్నుతట్టి ధైర్యాన్నిస్తుంది. ఆవేదన నుంచి ఆలోచన, ఆలోచన నుంచి ఆవేశం, ఆవేశం నుంచి కవిత్వం వస్తాయని పెద్దలన్నా రందుకే! చాలామంది కవులు తమలోని ఆవేదనను కవితలల్లటం ద్వారా తగ్గించుకుని కాస్త ఉపశమనం పొందుతుంటారు.

నిజాలు చెప్తే నిష్ఠూరంగా వుంటుంది. ఈ విషయాన్నే కవి ఒక మినీ కవితలో ఇలా అంటారు, "రోజుకో 'వారెవా'(మినీ కవిత) బాగానే వుంటుంది మీకు.. రోజుకు వంద తిట్లు బరువుగా ఉంటుంది నాకు..!" కవితల్లోని విషయం తమదేనని కొందరు భుజాలు తడుముకుంటారు. కవిని అలా రాసినందుకు నిందిస్తారు. ఇదీ సహ జమే! అలా అని లోకానికి భయపడి కవి రాయ కుండా వుండడు. చిన్న, చిన్న పదాలు, చిట్టి పొట్టి వాక్యాలతో వున్న సంగెవేని మినీ కవితలు చదివాక 'వారెవా' అని అనకుండా వుండలేం! అలాంటిది కవిగారి ప్రతిభ. ఆయన కలం నుండి మరెన్నో ఇలాంటి కవితలు జాలువారాలని ఆశిద్దాం.. అభినందిద్దాం!



సమీక్ష : డా. గంగిశెట్టి శివకుమార్
9441895343

# పశువైద్యంలో.. బుచ్చి ఫస్ట్

పశువులు, మూగజీవాలకు వైద్య చికిత్సలు అందించడంలో జిల్లాలోని అనేక ప్రాంతాలు వెనుకబడి ఉండగా, బుచ్చి ప్రాంతీయ పశువైద్యశాల కావలి డివిజన్‌లో ప్రథమస్థానం సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. అందరినీ సమన్వయ పరచి ప్రభుత్వ పథకాలను బాగా అమలుచేస్తున్నందుకు బుచ్చి ప్రాంతీయ పశువైద్యాధికారి డాక్టర్ బి.మురళీకృష్ణను, ఆయన సిబ్బంది సేవలను అధికారులంతా అభినందించారు. ఈనెల 11న బుచ్చిలో జరిగిన సమీక్ష కార్యక్రమంలో పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ రమేష్‌బాబుతో పాటు పలుశాఖల అధికారులు, డిఆర్‌డిఏ ఏపిఓ డాక్టర్ శశిధర్, జిల్లా పశుగణాభివృద్ధి సహాయ సంచాలకుడు డాక్టర్ కోటేశ్వరరావు పాల్గొని పశువైద్య సేవల్లో ముందుంటూ బుచ్చి అందరికీ ఆదర్శంగా ఉందని ప్రశంసించారు. వైఎస్సార్ చేయూత పథకం, జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం వంటి లక్ష్యాల సాధనలో, ప్రభుత్వ పథకాల అమలులో బుచ్చి పశువైద్యశాల సేవలు భేష్ అని కొనియాడారు.

### ఒంగోలులో 7 నుంచి

# హేతువాద సంఘం మహాసభలు

ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం రాష్ట్రమహాసభలు ఒంగోలు లోని రంగా భవన్‌లో జనవరి 16, 17 తేదీల్లో జరుగుతాయని ఆ సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16వ తేది ఉదయం 10.20 గంటలకు జరిగే సభలో ఏపి శాసనసభ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, న్యాయవాది చెలిమేల రాజేశ్వర్, డా.కదిరి కృష్ణ, జేవి కృష్ణయ్య, డా.వి బ్రహ్మారెడ్డి, ఎన్ రఘునందన్ పాల్గొంటారని, సభకు ఎం.అశోక్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. అదేవిధంగా, 17వ తేది ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సభకు లెక్చరర్ కృష్ణప్రియ అధ్యక్షత వహిస్తారని, డా.సమరం, డా. వి.వరప్రసాద్, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, డా. బీరం సుందరరావు, పుత్తా శివారెడ్డి తదితరులు పాల్గొంటారని, ఆ తర్వాత సంఘం కార్యవర్గ సమావేశంతో పాటు నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు.

# దేశానికి సేవ చేయడమే నా ధ్యేయం

## డిఆర్‌డిఓ ఛైర్మెన్.. మన సతీష్‌రెడ్డి




దేశానికి సేవ చేయడమే తన ధ్యేయమని, విదేశాలకు వెళ్ళకుండా నా మేధస్సును దేశానికే ఉపయోగించాలని నిర్ణయించుకున్నానని భారత రక్షణ పరిశోధన సంస్థ (డిఆర్‌డిఓ) ఛైర్మెన్, మన నెల్లూరీయుడు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 12న ఆయన జిల్లాలోని అనంతసాగరం మండలం లోని పడమటికంభంపాడు గ్రామంలో హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ జిఎస్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ హెల్పింగ్ హార్ట్స్ వారి సేవలు అభినందనీయమని, గ్రామీణ ప్రాంతాల్లోని యువకుల్లో క్రీడాస్ఫూర్తి మరింతగా పెంపొందాలన్నారు. తాను ఎవరికైనా మొదటగా కృతజ్ఞతలు చెప్పాల్సివస్తే మా అమ్మకే చెప్తానన్నారు. తల్లులు తమ పిల్లలకు కలలు కనడం నేర్పి, ఆ కలలు సాకారమయ్యేలా కృషి చేసేందుకు ప్రేరేపించాలని ఆయన సూచించారు. అనంతరం క్రికెట్ పోటీల్లో గెలుపొందినవారికి ఆయన బహుమతులు అందజేశారు. ఏఎంసి మాజీ ఛైర్మెన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, అల్లంపాటి రమణారెడ్డి, కాలం బుజ్జిరెడ్డి, హెల్పింగ్ హార్ట్స్ నిర్వాహకులు రొండ్ల వెంకటరమణారెడ్డి, వల్లూరు శ్రీనివాసులు, చింతగుంట నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట డిపిఓ ధనలక్ష్మి, ఎంపిడిఓ రాఘవేంద్ర తదితరులున్నారు.









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com